E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 10-03-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక:67|| పేజీలు–6
www.ekaburu.com

### ఎల్‌పీజీ సిలిండర్
## బుకింగ్ గడువు పెంపు



ఎల్‌పీజీ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్‌ను నివారించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సిలిండర్‌కు సిలిండర్‌కు మధ్య ఉన్న బుకింగ్ గడువును 21 నుంచి 25 రోజులకు పెంచింది.

....(మిగతా4లో)




### క్రీడా ప్రణాళిక సిద్ధం చేయాలి..
### సీఎం రేవంత్

ఈ కబురు , హైదరాబాద్ :
ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా తెలంగాణలో అన్ని సౌకర్యాలతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలిచ్చారు.




### ప్యాచ్ వర్క్ చేయమంటే రోడ్డు మొత్తం తవ్వేశారు...

ఈ-కబురు, శేరిలింగంపల్లి : "" చూసి రమ్మంటే కాల్చి వచ్చినట్లుగా ఉంది సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల తీరు... చిన్న ప్యాచ్ వర్క్ పని చేయాల్సిన చోట ఏకంగా 200 మీటర్ల సిసి రోడ్డును ఎడాపడా తవ్వి పడేశారు...

# పోలీసింగ్ మారాలి

- భవిష్యత్ సవాళ్లకు తగ్గట్లుగా మార్చుకోవాలి: సీఎం రేవంత్
- పోలీసులు ఆటోమోడ్‌లోకి వెళితే సమాజానికి ప్రమాదం...
- ఆపదొస్తే ప్రజలు చూసేది పోలీసుల వైపే..
- పోలీస్ అధికారులను నేను ఏ,బీ,సీ కేటగిరీలుగా చేసుకున్నా..
- ఎలాంటి పైరవీలకు తావులేకుండా పోస్టింగ్‌లు ఇస్తున్నాం..
- తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్– 2026లో ప్రసంగం



ఈకబురు, హైదరాబాద్: కాలక్రమేణా నేర స్వభావం మారుతోందని, సైబర్ నేరాలు, డ్రగ్స్ సరఫరా వంటి భవిష్యత్ సవాళ్లకు తగ్గట్టుగా పోలీసింగ్‌లోనూ మార్పులు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొట్టమొదట సహాయం కోసం చూసేది పోలీసుల వైపేనని, ఏళ్లుగా ప్రజల్లో పోలీసులు పెంచుకున్న విశ్వాసం అలాంటిదన్నారు. అయితే, పోలీస్ శాఖలో ఉద్యోగులు ఆటో మోడ్‌కు వెళితే సమాజానికి అత్యంత ప్రమాదకరమని సీఎం హెచ్చరించారు. మారుతున్న సాంకేతికత, నేరాలకు తగ్గట్టుగా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్‌గ్రేడ్ కావాలని చెప్పారు. వచ్చే 25 ఏళ్లకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. సోమవారం తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్- 2026 కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులనుద్దేశించి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. సీఎం ప్రసంగం ఆయన మాటల్లోనే...

**శాంతిభద్రతలు బలంగా ఉండాలి..**

అభివృద్ధి జరగాలంటే ఆ ప్రాంతంలో శాంతి భద్రతలు బలంగా ఉండాలి. శాంతిభద్రతలు బాగున్న రాష్ట్రాల్లోనే పరిశ్రమలు వస్తాయి.. తద్వారా ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. తెలంగాణలోనూ శాంతిభద్రతలు బాగున్నాయి కాబట్టే ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. దేశం వందేళ్ల స్వాతంత్ర్యదిన వేడుకల నాటికి తెలంగాణ సాంకేతికంగా, అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎదగాలి. అందుకు కొత్త విధానాలు తెస్తున్నాం. దేశంలో ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారింది. ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ముంబై, చెన్నై నగరాలు వరదలతో సతమతమవుతున్నాయి. అలాంటి మెట్రోపాలిటన్ నగరాల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్ నగరాన్ని కేవలం 24 గంటల్లో 2 సెం.మీ.వర్షపాతానికి తట్టుకునేలా అన్ని వ్యవస్థలు మనం ఏర్పాటు చేసుకున్నాం. కానీ, కోవిడ్ తర్వాత రెండు మూడు గంటల్లో 40 సెం.మీ.వర్షం వచ్చింది. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా అన్ని వ్యవస్థలు మార్చుకోవాలి.

**సమస్యను అర్థం చేసుకోవాలి..**

పోలీసు విధుల్లో నిరంతరం సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉటుంది. ఎన్నో సమస్యలు పరిష్కరించాలి. అయితే సమస్య పరిష్కారంలో వేగంగా పరిగెత్తితే అది మరింత గందరగోళానికి దారి తీస్తుంది. సమస్యలను అర్థం చేసుకుంటే 50 శాతం పరిష్కారం దొరుకుతుంది. సమస్యను అర్థం చేసుకునేందుకు కింది స్థాయి సిబ్బందికి తగిన సమయం ఇవ్వండి. అధికారుల విద్యార్హత, నైపుణ్యం ఆధారంగా వాళ్లకు డ్యూటీలు ఇస్తే మరింత రాణించే అవకాశం ఉంటుంది.

....(మిగతా2 లో)

# ఈ రణం.. వాతావరణానికి శాపం!



ఈ కబురు ;
ప్రపంచంలో జరుగుతున్న ఘర్షణల జాబితాలో అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధం చేరింది. దీనివల్ల పర్యావరణపరమైన నష్టాలు కూడా తీవ్రస్థాయిలో పొంచి ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ యుద్ధం సుదీర్ఘకాలం సాగబోదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరంభంలో చెప్పారు. కానీ కొద్దిరోజులకే పరిస్థితి మారిపోయింది. పోరు ఎప్పటికి ముగుస్తుందో అర్థంకాని అయోమయ స్థితి నెలకొంది.
పశ్చిమాసియాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి మరణాల సంఖ్య, చమురు ధరలు, నౌకాయానంలో ఇబ్బందులు వంటి అంశాల గురించే ప్రపంచ దేశాలు చర్చించుకుంటున్నాయి. వాతావరణ కాలుష్యంపై పెద్దగా దృష్టి సారించడంలేదు. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల వల్ల ఈ యుద్ధం పర్యావరణానికి పెను శాపంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఆందోళనకర స్థాయిలో ఉన్న భూతాపాన్ని ఇది తీవ్రం చేయవచ్చని చెబుతున్నారు. ఫలితంగా మానవాళి భవిత ప్రమాదంలో పడుతుందంటున్నారు.

....(మిగతా2లో)

## సెక్యులరిజానికి కేరాఫ్ చిరునామా కాంగ్రెస్ పార్టీ

- ఢిల్లీ నుండి గల్లీ వరకు ముస్లింలకు అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీనే
- సర్వమతాలను సమానంగా చూస్తాం
- ముస్లింల రక్షణతో పాటు సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం; -మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



ఈ కబురు , సూర్యాపేట :
ఢిల్లీ నుండి గల్లీ వరకు ముస్లింలకు అండగా నిలబడేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే నని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.భారతదేశంలో సర్వమతాలను సమానంగా చూస్తూ వారి వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న పార్టీ కుడా కాంగ్రెస్ పార్టీ

....(మిగతా2లో)



## రైతుల భూములకు భద్రత కల్పిస్తాం ...రైతుల ఆదాయం పెంచుతాం

- ఉచితంగా రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలు
- 2027 చివరి నాటికి అన్ని రకాల భూ వివాదాల పరిష్కారానికి ప్రయత్నం
- భూ అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ పెడతాం... జైళ్లకు పంపుతాం
- గత పాలనలో మంత్రులే ముఠాలు కట్టి భూ అక్రమాలకు పాల్పడ్డారు
- గత పాలకులు కుంభకోణాలు చేశారు... కల్తీ మద్యంతో ప్రాణాలు తీశారు
- నాడు నేరాలు-ఘోరాలు... నేడు అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలు
- నంద్యాల జిల్లా కొత్తబురుజులో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో సీఎం చంద్రబాబు

**ఈ కబురు, అమరావతి :-**
వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి రాష్ట్రంలోని భూ సమస్యలన్నీ పరిష్కరించేలా ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎలాంటి భూ వివాదాలు లేకుండా చర్యలు తీసుకుని... ట్యాంపర్ చేయడానికి ఆస్కారం లేని విధంగా రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రంలోని రైతుల భూములకు భద్రత కల్పించడంతోపాటు... ....(2లో)

### ఖమ్మంలో ఉద్రిక్తత..
## కల్వకుంట్ల కవిత అరెస్ట్



**ఈ కబురు, ఖమ్మం :**
ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్ల ప్రాంతంలో పేదలు వేసుకున్న గుడిసెలను అధికార యంత్రాంగం తొలగించడాన్ని నిరసిస్తూ బాధితులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ బాధితులతో కలిసి జడ్పీ సెంటర్ వద్ద భారీ ధర్నాకు దిగారు. సుమారు రెండు గంటల పాటు అంబేద్కర్ విగ్రహం ఎదుట బైఠాయించడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. ఆందోళన ఉధృతం కావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. బాధితులను, నాయకులను చెదరగొట్టే ప్రయత్నంలో పోలీసులకు, నిరసనకారులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. మహిళా బాధితులు, లేడీ పోలీసుల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది.

....(మిగతా2లో)

## తెలంగాణ సమస్యలను దిల్లీలో వినిపిస్తా: వేం నరేందర్‌రెడ్డి

ఈ కబురు, హైదరాబాద్:
తెలంగాణలో కాంగ్రెస్ తరపున రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిద్దరికి రిటర్నింగ్ అధికారి ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాలు అందజేశారు.



....(మిగతా3లో)



## హైడ్రాపై వెనక్కి తగ్గేదే లే

- .. నల్లచెరువు ఆనందం చూశాక.. తిట్లు ఆశీర్వాదాల్లా అనిపిస్తున్నాయి.. రేవంత్ రెడ్డి
- హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాలకు నిధులు మంజూరు చేస్తా
- చెరువుల పునరుద్ధరణ వల్ల భవిష్యత్తులో వరద ముప్పు తప్పుతుంది
- పేదవాడిని ఇబ్బంది పెట్టడం ప్రభుత్వ ఉద్దేశం కాదు
- అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయిస్తాం
- పాలకులకు దూరదృష్టి ఉండాలి; సిఎం రేవంత్ రెడ్డి

....(మిగతా2లో)

### ఆరు గ్యారెంటీలకు
## చట్టబద్ధత కల్పించాలి

.. అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లుకు బీఆర్ఎస్ సిద్ధం: కేటీఆర్
రాహుల్ బంధు కింద రేవంత్ రెడ్డి రూ.1000 కోట్లు పంపిస్తున్నారు: కేటీఆర్ ఎద్దేవా



**ఈ కబురు :**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాజీ మంత్రి కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి పార్టీలో చేరుతున్న వారికి గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్లుగా విజయం సాధించిన అభ్యర్థులను ఆయన ఘనంగా సన్మానించారు.

....(మిగతా2లో)

## యాసిడ్ దాడి బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు



....(3లో)

# ఖమ్మంలో ఉద్రిక్తత.. కల్వకుంట్ల కవిత అరెస్ట్



జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని బాధితులు భీష్మించుక కూర్చున్నారు. ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో అంబేద్కర్ సెంటర్ పరిసర ప్రాంతాలు హోరెత్తాయి. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో పోలీసులు కల్వకుంట్ల కవితను, విశారదన్ మహరాజ్‌ను బలవంతంగా అరెస్ట్ చేసి వాహనాల్లోకి ఎక్కించారు. అయితే, కవితను అరెస్ట్ చేసే సమయంలో మహిళా కానిస్టేబుళ్లు లేకపోవడంపై జాగృతి నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మహిళా నాయకురాలిని పురుష పోలీసులు ఎలా అరెస్ట్ చేస్తారని వారు నిలదీశారు. పోలీసుల తీరును నిరసిస్తూ కవిత అనుచరులు వాహనాలకు అడ్డుపడటంతో ఉద్రిక్తత పరాకాష్టకు చేరింది. వెలుగుమట్ల భూదాన భూముల్లో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న పేదల పొట్ట కొట్టవద్దని, వారికి ప్రత్యామ్నాయం చూపకుండా గుడిసెలు తొలగించడం దుర్మార్గమని కవిత ఈ సందర్భంగా విమర్శించారు. బాధితులకు ఇళ్లు ఇచ్చే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఖమ్మం నగరంలో భారీగా పోలీసులను మోహరించారు. అరెస్ట్ చేసిన వారిని స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ ఘటనతో జిల్లా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

# పోలీసింగ్ మారాలి

జనాభా ప్రాతిపదికన క్షేత్రస్థాయి అవసరాలకు తగ్గట్టుగా పోలీసులపై పనిభారం, ఒత్తిడి తగ్గించేలా సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలి. ప్రత్యేక అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్న గ్రేహౌండ్స్, ఎస్ఐబీ వంటి సంస్థలు తమ లక్ష్యాన్ని దాదాపుగా చేరుకున్నాయి. కూబింగ్ పోయింది కాబట్టి గ్రేహౌండ్స్‌లో ఉన్న సిబ్బందిని మరోచోట వాడుకోవాలి. విచారణలో సేకరిస్తున్న సమాచారాన్ని ఐసీసీసీలో ఒక డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయండి.

పోలీసులను ఏ, బీ, సీగా వర్గీకరించుకున్నా..

పోలీసు అధికారుల పనితీరుకు సంబంధించిన పూర్తి సమాచారం నా దగ్గర ఉంది. దాని ఆధారంగా వాళ్లను నేను ఏ, బీ, సీ కేటగిరీల్లో వర్గీకరించుకుని పెట్టుకున్నా. దానికి అనుగుణంగానే నేను వారికి పోస్టింగ్స్ ఇస్తున్నా. ఈ విషయంలో నేను కరెక్ట్ లేదా తప్పు కావొచ్చు. ఈ రెండేళ్లలో ఎలాంటి పైరవీలు లేకుండా 90 శాతం మందికి ఇలానే పోస్టింగ్‌లు ఇచ్చాం. టీవీల్లో వచ్చే వరకు కూడా ఎవరికి ఎక్కడ పోస్టింగ్ వచ్చిందో తెలియలేదు.

పోలీసింగ్‌లో మార్పులు, నూతన చట్టాలు తేవాల్సిన ఆవశ్యకత, ఇతర అంశాలపై చర్చించేందుకు ఏటా డిసెంబర్‌లో పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ నిర్వహించాలి. బడ్జెట్ ప్రవేశపెట్టకముందే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటే అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించుకోవచ్చు. సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్‌మెంట్, ఇతర సమస్యల పరిష్కారానికి మీరు కొన్ని ప్రతిపాదనలు అందించారు. వీటిపై విశ్లే□□ంచాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో అధికారుల కమిటీ నియమిస్తాం.

అందరికీ పోస్టింగ్‌లు వచ్చాయి: డీజీపీ శివధర్‌రెడ్డి

2001-02లో అప్పటి డీజీపీ హెచ్‌జే దొర ఆఫీసర్స్ రిట్రీట్ ను ప్రారంభించారని, 24 ఏళ్ల తర్వాత ఆ సంప్రదాయాన్ని మళ్లీ ప్రారంభించినట్టు డీజీపీ బి.శివధర్‌రెడ్డి తెలిపారు. గతంలో రెండు మూడేళ్లపాటు కూడా ఐపీఎస్ అధికారులు పోస్టింగ్‌లు లేకుండా చీఫ్ ఆఫీస్‌లో ఉండేవారని, అయితే గత రెండేళ్లలో ఏ ఒక్క అధికారి ఖాళీగా ఉండకుండా అందరికీ పోస్టింగ్‌లు ఇచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు అని చెప్పారు.

భవనాలు, రోడ్డు రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ మాట్లాడుతూ, పోలీసులు, రవాణాశాఖ అధికారులు కలిసి పనిచేస్తే ట్రాఫిక్ పరమైన సమస్యలు పరిష్కరించవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా టీజీ పోలీస్ అకాడమీ మ్యానువల్‌ను రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. చైల్డ్ ప్రొటెక్షన్ స్ట్రెంథెనింగ్ యూనిట్ ఏర్పాటుపై టీజీపీఏ, యూనిసెఫ్‌ల మధ్య ఎంఓయూ కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# హైడ్రాపై వెనక్కి తగ్గేదే లే

ఈ కబురు, హైదరాబాద్ :

హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని నల్లచెరువు పునరుద్ధరణ పనులను పూర్తి చేసి ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు అరికపూడి గాంధీ ఎంపీలు అధికారులు పాల్గొన్నారు. గతంలో ఈ ప్రాంత ఎంపీగా ఉన్నప్పుడు నిధుల కొరత వల్ల చేయలేకపోయిన అభివృద్ధిని ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో నూటికి నూరు శాతం పూర్తి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా గెలిచిన ప్రతినిధులు ఎవరైనా సరే మల్కాజగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. హైడ్రా చేపట్టిన ఆక్రమణల తొలగింపుపై వస్తున్న విమర్శలను సీఎం రేవంత్ రెడ్డి తిప్పికొట్టారు. చెరువుల పునరుద్ధరణ వల్ల భవిష్యత్తులో వరద ముప్పు తప్పుతుందని ఆయన పేర్కొన్నారు. చెరువులు నాలాలు ఆక్రమించడం వల్లే చిన్న వర్షానికే కాలనీలు మునిగిపోయి ప్రజల ఆస్తులు సర్టిఫికేట్లు నీళ్లపాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాను నిజాంపేట వంటి ప్రాంతాల్లో నడుముల లోతు నీళ్లలో తిరిగి ప్రజల కష్టాలను చూశానని గుర్తు చేశారు. ఆక్రమణల తొలగింపులో నివాసాలు కోల్పోయిన అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఏ పేదవాడిని ఇబ్బంది పెట్టడం ప్రభుత్వ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. నగరంలోని చెరువులను కేవలం నీటి వనరులుగానే కాకుండా ఆర్థిక కేంద్రాలుగా (Lake Economy) మార్చాలని ముఖ్యమంత్రి సూచించారు. చెరువుల గట్టున మహిళా స్వయం సహాయక సంఘాలకు షాపులు కేటాయించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాయంత్రం వేళ వాకింగ్‌కు వచ్చే ప్రజలకు పాలు కూరగాయలు నిత్యావసర వస్తువులు అక్కడే దొరికేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పిల్లలు రోడ్ల మీద ఆడుకుంటూ ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి చెరువు వద్ద ప్లే గ్రౌండ్లు స్కేటింగ్ కోర్టులు నిర్మించాలని ఆదేశించారు. కూకట్‌పల్లిలోని సున్న చెరువు పాత్సాగర్ తుమ్మిడికుంట వంటి చెరువులన్నింటినీ ఇదే తరహాలో పునరుద్ధరిస్తామని వెల్లడించారు. ఢిల్లీలో కాలుష్యం బెంగళూరులో ట్రాఫిక్ ముంబైలో వరదలు వంటి సమస్యలు పాలకుల దూరదృష్టి లోపం వల్లే వచ్చాయని రేవంత్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రాకూడదనే మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలిపారు. అహ్మదాబాద్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్ మాదిరిగానే మూసీ నదిని ప్రక్షాళన చేసి తీరుతామన్నారు. దీనివల్ల ఎవరైనా ఇళ్లు కోల్పోతే వారికి నష్టపరిహారం అందిస్తామని లేదా ఇళ్లు కట్టించి ఇస్తామని భరోసా ఇచ్చారు. అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని అప్పు తెచ్చైనా సరే నగర ప్రక్షాళనకు నిధులు కేటాయిస్తానని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

# ఈ రణం.. వాతావరణానికి శాపం!

--యుద్ధంతో కాలుష్యం ఇలా..

2023 అక్టోబరులో మొదలైన ఇజ్రాయెల్‌గాజా ఘర్షణల్లో మొదటి 120 రోజుల్లోనే వెలువడిన గ్రీన్‌హౌస్ వాయువులు.. 26 దేశాల వార్షిక ఉద్గారాల కన్నా ఎక్కువని ఒక అధ్యయన నివేదిక పేర్కొంది. యుద్ధంలో దెబ్బతిన్న మౌలిక వసతుల పునర్‌నిర్మాణం వల్ల ఉత్పన్నమయ్యే ఉద్గారాలనూ లెక్కించుకుంటే అది 135 దేశాల వార్షిక ఉద్గారాలను మించిపోవచ్చని తెలిపింది. 'ఇనీషియేటివ్ ఆన్ జీహెచ్‌జీ ఎకౌంటింగ్ ఆఫ్ వార్' అంచనాల ప్రకారం ఇజ్రాయెల్‌గాజా మూడేళ్ల ఘర్షణల వల్ల 230 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్ డైఆక్సైడ్‌కు సమానమైన హానికారక ఉద్గారాలు వెలువడ్డాయి. ఇవి ఆస్ట్రియా, హంగరీ, చెక్ రిపబ్లిక్, స్లొవేకియాల ఉమ్మడి వార్షిక ఉద్గారాలతోసమానం. ఇందులో యుద్ధ ట్యాంకులు, ఫైటర్ జెట్‌లు, శతఘ్నుల వంటి ఆయుధాల వాటా 36 శాతంగా ఉంది. పోరాటాల వల్ల చెలరేగే కార్చిచ్చుతో జరిగే నష్టం దీనికి అదనం. 2024లో ఉక్రెయిన్‌లో 9,65,000 హెక్టార్ల అటవీ ప్రాంతం కాలిపోయింది. అదే కాలంలో యూరోపియన్ యూనియన్ అంతటా తగలబడిన అడవులకు ఇది రెట్టింపు విస్తీర్ణం కావడం గమనార్హం.

--నష్టాల ప్రస్తావనేదీ?

యుద్ధంతో జరిగే నష్టాలేవీ అధికారిక వాతావరణ నివేదికల్లో కనిపించడంలేదని నిపుణులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. భూతాపం కట్టడికి ఉద్దేశించిన పారిస్ ఒప్పందం ప్రకారం.. సైనిక ఉద్గారాల వెల్లడి పూర్తిగా స్వచ్ఛందమే. ఈ వెసులుబాటు వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేకచోట్ల యుద్ధాలతో ముడిపడ్డ ఉద్గారాలతో కలిగే నష్టాలు లెక్కలు సరిగా నమోదు కావడంలేదు.

--గల్ఫ్‌లో యుద్ధం ఎందుకంత ఆందోళనకరం?

గల్ఫ్ ప్రాంతంలో చమురు క్షేత్రాలు, ఆయిల్ రిఫైనరీలు, గ్యాస్ ప్రాసెసింగ్ కేంద్రాలు, ఇంధన నిల్వ కేంద్రాలు ఉన్నాయి. వాటిపై దాడి చేసినప్పుడు కార్బన్ డైఆక్సైడ్‌తోపాటు సల్ఫర్ డైఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, క్యాన్సర్ కారక రేణువులు, విషతుల్య సేంద్రియ పదార్థాలు భారీగా విడుదలవుతాయి. పర్షియన్ గల్ఫ్ ప్రాంతం పాక్షికంగా సముద్ర సంధానతను కలిగి ఉంది. అందువల్ల అక్కడి నుంచి కాలుష్యకారకాలు త్వరగా తొలగిపోవు. ప్రస్తుత యుద్ధం కారణంగా నౌకలు సుదీర్ఘ ప్రయాణ మార్గాలను ఎంచుకోవాల్సి వస్తోంది. ఫలితంగా ఎక్కువ ఇంధనాన్ని మండించాల్సి వస్తోంది. ఇది మరిన్ని ఉద్గారాలకు దారితీస్తోంది. భారీ బంకర్ బస్టర్ బాంబులతో పెను దాడులు చేయడం వల్ల భారీగా కాంక్రీటు, శిలలు, లోహాలు విస్ఫోటం చెందుతున్నాయి. ఫలితంగా భారలోహాలు, విషతుల్య ఆమ్ల పదార్థాలతో కలిసిన ధూళి మేఘాలు వాతావరణంలోకి విడుదలవుతున్నాయి. దీనివల్ల భూగర్భ జలాలు విషతుల్యంగా మారుతున్నాయి. పర్యావరణ వ్యవస్థలు, నేల దెబ్బతింటున్నాయి. ప్రజారోగ్యానికి, జీవ వైవిధ్యానికి హాని కలిగిస్తున్నాయి. ఇరాన్ ఇప్పటికే తీవ్రస్థాయిలో వాతావరణ ఇబ్బందులను ఎదుర్కొంటోంది. తీవ్ర కరవు, నీటి వసతి కలిగిన తడి నేలలు పొడిబారడం, వాయు కాలుష్యం వంటి సమస్యలతో సతమతమవుతోంది.

--వనరుల మళ్లింపు..

తాజా దాడుల నేపథ్యంలో దేశాలు కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ఉద్దేశించిన వనరులను మళ్లిస్తాయన్న ఆందోళనలు కూడా ఉన్నాయి. అంతిమంగా ఇది.. పారిస్ ఒప్పంద లక్ష్యాలకు తూట్లు పొడుస్తుందన్న నిపుణులు హెచ్చరిస్తున్నారు. యుద్ధానంతరం పునర్‌నిర్మాణ ప్రక్రియలో వెలువడే ఉద్గారాలు దీర్ఘకాల వాతావరణ సమస్యల భారాన్ని పెంచుతుందంటున్నారు

# ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలి



ఈ సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో సాగు సమయానికి ముందే రైతుల ఖాతాల్లో 'రైతు బంధు' డబ్బులు జమ అయ్యేవని, కానీ నేడు రైతులు ఆ సాయం కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 'రైతు బంధు'ను నిలిపివేసి, కొత్తగా 'రాహుల్ బంధు' అనే పథకాన్ని అమలు చేస్తోందని కేంద్రానికి రూ.1000 కోట్లు పంపేందుకు సిద్ధమయ్యారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఖజానా నుంచి ఏడాదికి వెయ్యి కోట్లు రాహుల్ గాంధీకి పంపించి, తన పదవిని కాపాడుకోవడమే రేవంత్ లక్ష్యమని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇళ్లు కూల్చడమేనా అని ఆయన ప్రశ్నించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వికలాంగుల ఇళ్లను సైతం నిర్దాక్షిణ్యంగా కూల్చేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి సొంత ఇల్లు మరియు ఆయన సోదరుడి ఇల్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై కేటీఆర్ సెటైర్లు వేశారు. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు కావస్తున్నా అతీగతీ లేదని విమర్శించారు. ఆడబిడ్డల పెళ్లికి తులం బంగారం, రైతులకు పంట బోనస్, మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రం ఆర్థిక కష్టాల్లో ఉందని చెబుతూనే, లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ చేపట్టడం వెనుక ఆంతర్యమేమిటని అడిగారు. 40 లక్షల మంది వృద్ధులు రూ. 4 వేల పెన్షన్ కోసం, నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీసీల సంక్షేమం కోసం రూ. 20 వేల కోట్లు కేటాయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ బీఆర్ఎస్ తరపున ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టే ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. రైతుల పొట్ట కొడుతున్న ఈ 'రాబందు' ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలందరూ మళ్లీ కేసీఆర్ పాలన కోసం వేచి చూస్తున్నారని, రాబోయే రోజుల్లో ప్రజా పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సెక్యులరిజానికి కేరాఫ్ చిరునామా కాంగ్రెస్ పార్టీ



మాత్రమే నని ఆయన స్పష్టం చేశారు.రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నేత సర్వోత్తం రెడ్డి,జిల్లా కాంగ్రెస్ అద్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి,మున్సిపల్ చైర్మన్ మోరిశెట్టి నివేదితా లక్షాది ,పిసిసి కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో సెక్యులరిజానికి పెద్ద పీట వేస్తున్నది కాంగ్రెస్ పార్టీ మాత్రమే నన్నారు. లోకసభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ మొదలు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వరకు ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుందని ఆయన చెప్పారు.ఒక్క మాటలో చెప్పాలి అంటే సెక్యులరిజానికి కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ చిరునామాగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు.ముస్లింల రక్షణతో పాటు వారి వారి అభివృద్ధితో పాటు సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు పెద్ద పీట వేశాయని ఆయన గుర్తుచేశారు.ముస్లింలు పవిత్ర మాసంగా భావించే రంజాన్ మాసంలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఆనంద దాయకంగా ఉందన్నారు.సూర్యాపేట లో ముస్లింల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా మంత్రిగా నిరంతరం అందుబాటులో ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలో షాధిఖాన, కమ్యూనిటి హాల్,ఖబరస్తాన్ వంటి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

## రైతుల భూములకు భద్రత కల్పిస్తాం

# ...రైతుల ఆదాయం పెంచుతాం

వారి ఆదాయాలు పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్తబురుజులో మీ భూమిమీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు సీఎం అందించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."గత ప్రభుత్వం రెవెన్యూ శాఖను అస్తవ్యస్తం చేసింది. నాడు మంత్రులే భూ కబ్జాలకు పాల్పడ్డారు. డోన్ లో మంత్రిగా ఉన్న వ్యక్తి ఒక సాధారణ రైతు భూమిని తన అనుచరులకు కట్టబెట్టేశారు. గత ప్రభుత్వంలో 1.95 లక్షల ఎకరాలను 22ఏలో పెట్టారు. ప్రైవేట్ భూముల రికార్డులను తమ ఇష్టం వచ్చినట్టు మార్చేశారు. అడిగిన భూమి ఇవ్వకపోతే 22ఏలో పెట్టేసేలా గత ప్రభుత్వం వ్యవహరించింది. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తెచ్చి ప్రైవేట్ భూములపై అజమాయిషీని సొంత వాళ్లకు కట్టబెట్టాలని చూశారు. అప్పీల్‌కు వెళ్లడానికి వీలు లేకుండా నిబంధనలు చేశారు. ఇదే జిల్లా పాణ్యం నియోజకవర్గంలో నాటి ప్రభుత్వం తప్పుల తడకగా జారీ చేసిన పట్టాదారు పుస్తకాన్ని కాల్చి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేస్తామని హామీ ఇచ్చాను. అధికారంలోకి రాగానే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశాం. భూ రికార్డుల్లో తప్పులను సరిదిద్దుతున్నాం. వారసత్వంగా వచ్చిన భూములు, సొంత శ్రమతో కొనుగోలు చేసిన భూములకు చెందిన పుస్తకాలపై నాటి పాలకుల ఫోటోలు వేసుకున్నారు. ఫోటోల పిచ్చితో జీవితాలతో ఆడుకునే పరిస్థితికి వచ్చారు. సర్వే రాళ్లపైనా ఫోటోలు ముద్రించుకున్నారు... రూ.750 కోట్లు ఫోటోలకు ఖర్చు చేశారు. ఎక్కడెళ్లినా భూ సమస్యలపై కట్టకట్టలు అర్జీలు వచ్చాయి"అని సీఎం చెప్పారు.

--రెవెన్యూ వ్యవస్థను గాడిన పెట్టేందుకు 20 నెలలు పట్టింది

"వాళ్లు చేసిన ఒక దుర్మార్గాన్ని సరిదిద్దడానికి 20 నెలలు పట్టింది. రైతుల సమక్షంలోనే భూ కొలతలు తీసుకుని రైతుల ఆమోదంతో భూ వివరాలతో పుస్తకాలు ఇస్తున్నాం. భూ రికార్డులు తారుమారు చేయకుండా పక్కాగా పట్టా ఇస్తున్నాం. క్యూఆర్ కోడ్ విధానం తీసుకొచ్చాం. ఎవరు రికార్డులు తారుమారు చేసినా తెలిసిపోతుంది. ఎమ్మార్వో, వీఆర్వోలు తప్పు చేసినా బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా తెలిసిపోతుంది. మేం ఇచ్చిన పట్టాదార్ పుస్తకాలను ట్యాంపర్ చేయలేరు. వివాదాల్లేని పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇప్పించే బాధ్యత నాది. రాష్ట్ర వ్యాప్తంగా 16,816 గ్రామాలున్నాయి. 6,860 గ్రామాల్లో సర్వే గత ప్రభుత్వంలో చేశారు. తప్పుల తడకతో 19.93 లక్షల పుస్తకాలు ఇచ్చారు. రికార్డులు తారుమారు చేసి ఇచ్చారు. అవన్నీ పక్కనపెట్టి మళ్లీ కొత్తగా రైతులకు పుస్తకాలు అందిస్తున్నాం. గత పాలకులు చేసిన తప్పును సరిదిద్దుతూ ప్రభుత్వమే ఉచితంగా పట్టాలు ఇస్తోంది. రిజిస్ట్రేషన్ విధానం కూడా సులభతరం చేస్తున్నాం."అని సీఎం చెప్పారు.

--భగీరథ స్ఫూర్తితో సీమలో ప్రతి ఎకరాకు నీరు

"సీమలో ముఠా నాయకులు ఉండేవారు. ఎన్నికల సమయంలో డబ్బుల కంటే బాంబులు అడిగే పరిస్థితి ఉండేది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దౌర్భగ్యాలు ఉండకూడదని... ఈ ప్రాంతంలో ముఠా తగాదాలను తుదముట్టించాం. ముఠాలు వద్దు గ్రామాల్లో ప్రశాంతతే ముద్దు అని చెప్పి వైరం ఉన్న నేతలను కలిపాను. రాయలసీమలో ప్రతి ఎకరాకు నీరివ్వాలన్నది నా సంకల్పం. మొదట హంద్రీనీవా ఆలోచన చేసింది ఎన్టీఆర్. హంద్రీనీవా, గాలేరునగరి, తెలుగుగంగ సహా అనేక ప్రాజెక్టులకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. వాటిని నేను పూర్తి చేస్తున్నాను. ఈ డోన్ నియోజకవర్గంలో హంద్రీనీవా ద్వారా 30 చెరువులకు నీరిచ్చాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం. ఇక్కడి ఉత్పత్తులను ప్రపంచమంతా ఎగుమతి చేసే సౌకర్యాలు కల్పిస్తాం. అగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేస్తాం. మామిడికి తెగులు వస్తే పేపర్ కవర్ పెట్టే పద్ధతి తెచ్చాం. మామిడి పండ్లకు తొడిగే కవరుకు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నాం. దీంతో నాణ్యత పెరిగింది... లాభాలు వచ్చాయి. కవరు తొడిగిన పండ్లకు రూ.40 వేల దాకా ఆదాయం వస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో మామిడికి ధర పెరిగి ఒక టన్నుకు రూ. లక్షా 70 వేల వరకూ ఆదాయం వస్తోంది. మామిడికి రేటు తగ్గితే కేజీకి రూ.4 సబ్సిడీ ఇచ్చాం. సీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తాం. కేంద్రం రూ.30 వేల కోట్లు పూర్వోదయ పథకం కింద ఇస్తుంది"అని ముఖ్యమంత్రి చెప్పారు.

--విద్యుత్ ఛార్జీలు పెంచబోం

"సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పేదలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుంది. నేను కష్టపడేది ప్రజల కోసమే. ఇంట్లో ఎందరు పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం ఇస్తున్నాం. జనాభా పెరుగుదలపై దృష్టి పెట్టాం. పాపులేషన్ మేనేజ్ మెంట్ పాలసీ తెచ్చాం. పెద్ద కుటుంబమే మనకు రక్ష. పెద్ద కుటుంబాలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అధికంగా ఇస్తాం. అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ. 20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం. వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. రైతును రాజు చేస్తాం. టెక్నాలజీ సాయంతో అగ్రి టెక్ ద్వారా ముందుగానే తెగులు పసిగట్టి నివారణ సూచిస్తాం. ఆడబిడ్డలకు దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. స్త్రీ శక్తి ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. మెగా డీఎస్సీ నిర్వహించాం. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 23 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఈ 20 నెలల్లో 6.88 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదే. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మరమ్మతులు చేశాం. పంచాయతీరాజ్ శాఖ రోడ్ల విషయంలో ఉన్న సమస్యలనూ పరిష్కరిస్తాం. రూ.4 వేల కోట్లు పంచాయతీ రోడ్లకు కేటాయిస్తున్నాం. గత పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనకు తేడా ఏంటో ప్రజలు గ్రహించాలి. రాయలసీమలో స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వస్తున్నాయి. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులు పెడుతున్నాం. భూగర్భ జలాల పెంపుపై దృష్టి పెడుతున్నాం. గత ప్రభుత్వంలో 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల మేర విద్యుత్ భారాన్ని మోపారు. కూటమి ప్రభుత్వం భవిష్యత్ లో కరెంటు చార్జీలు పెంచబోదని హామీ ఇస్తున్నాను.. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీరు అందిస్తాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరుల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. ఒక ఏడాదిలో లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేశాం. ఈ ఏడాదికి ఇంకో 5 లక్షలమందిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తాం. స్వయం ఏపీ ఏపీ పేరుతో స్వయం సహాయక బృందాల ఉత్పత్తులకు బ్రాండ్ తీసుకొచ్చాం. సమాజంలో ఆర్థికంగా ఇబ్బందులో వారికి చేయూత కోసం పీ4 అమలు చేస్తున్నాం. డోన్ నియోజకవర్గంలో అన్ని సమస్యలను పరిష్కరించి అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు విడుదల చేస్తాం. కొత్త బురుజులో సీసీ రోడ్లు వేసేందుకు నిధులు కేటాయించడంతో పాటు అర్హులకు ఇళ్లు నిర్మిస్తాం"అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.



# ఘనంగా విజేత సూపర్ మార్కెట్ 27వ వార్షికోత్సవ వేడుకలు


సమావేశంలో ప్రసంగిస్తున్న విజేత ఎండీ జగన్మోహన్ రావు

**కస్టమర్ల విశ్వాసమే 'విజేత'ను ముందుకు నడిపిస్తుంది: విజేత ఎండీ జగన్మోహన్రావు**

ఈకబురు, శేరిలింగంపల్లి : కస్టమర్ల విశ్వాసమే తమ సూపర్ మార్కెట్ల ఫ్రాంచైజీ విజేతను విజయవంతంగా ముందుకు నడిపిస్తుందని విజేత సూపర్ మార్కెట్ ఎండీ జగన్మోహన్ రావు అన్నారు. విజేత సూపర్ మార్కెట్ 27వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన సంస్థ ఎండీ జగన్మోహన్ రావు మాట్లాడుతూ ప్రజలకు అత్యుత్తమ సేవలందించాలనే ఏకైక ఉద్దేశ్యంతో గత 27 సంవత్సరాల క్రితం ప్రారంభించిన సంస్థ నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తరించిందని, అందుకు కస్టమర్లు విజేత మీద పెట్టుకున్న నమ్మకం, ప్రోత్సాహమే కారణమన్నారు. ప్రజలు రోజువారి జీవితంలో ఉపయోగించే నిత్యావసర వస్తువులను నాణ్యతతో అందించడం విజేత విజయ రహస్యమని అన్నారు. చందానగర్ లో ప్రారంభమైన విజేత ప్రస్థానం నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక బ్రాంచ్ లతో ముందుకు సాగుతుందని, కస్టమర్లు తమపై నమ్మకంతో సూపర్ మార్కెట్లకు వస్తున్నారని అన్నారు. కస్టమర్ల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాణ్యతతో కూడిన వస్తువులను తక్కువ ధరకు అందించేందుకు విజేత ఎల్లవేళలా ముందుంటుందని తెలిపారు. నేడు విజేత సూపర్ మార్కెట్లతో ఎన్నో వేల మంది ఉపాధి పొందుతున్నారని అన్నారు. ఏ వ్యాపారమైనా వినియోగదారుల నమ్మకం మీదే ముందుకు సాగుతుందని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉత్తమంగా సేవలు అందించినప్పుడే వ్యాపారం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. తమ సిబ్బందికి ఎల్లవేళలా ఇదే విషయాన్ని గుర్తు చేస్తూ ఉంటామని, కస్టమర్ల నమ్మకాన్ని కోల్పోకుండా, నాణ్యతతో కూడిన వస్తువులను సరఫరా చేయాలని సూచిస్తుంటామన్నారు. చందానగర్ లో కేవలం ఒక్క బ్రాంచ్ తో ప్రారంభించిన తమ వ్యాపారం నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు పరిచయం అవసరం లేని పేరుగా మారిందన్నారు. రోజువారి జీవితంలో ఏ చిన్న సామాగ్రి కావాలన్నా ప్రజలు విజేత వైపు చూస్తున్నారని అన్నారు. ముఖ్యంగా పప్పు దినుసులు, బియ్యం, మసాలాలు వంటి వంట సామాగ్రిని రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తూ, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కస్టమర్లకు అందజేస్తున్నట్లు తెలిపారు. 1999లో చందానగర్ లో మొదటి బ్రాంచ్ తో ప్రారంభమైన తమ ప్రస్థానం తెలుగు రాష్ట్రాల్లోని టైర్ టూ నగరాకు సైతం విస్తరించిందని అన్నారు. తమ విజయంలో కస్టమర్లు తమపై పెట్టుకున్న నమ్మకంతో పాటు కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా నాణ్యతతో కూడిన వస్తువులను అందజేస్తున్న తమ సిబ్బంది కృషి ఎనలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజేత సూపర్ మార్కెట్ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు, కస్టమర్లు పాల్గొన్నారు.

## గడువు ముగిసిన వంట నూనె,
# గోదుమ పిండితో కల్తీ దందా

**బ్రాండెడ్ ప్యాకింగ్ తో కల్తీ వస్తువుల విక్రయం**
**గచ్చిబౌలిలో తండ్రి, కుమారుడు అరెస్టు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి** : కాలం చెల్లిన, గడువు ముగిసిన వంట నూనె, గోదుమ పిండిలను సేకరిస్తున్న ఇద్దరు కంత్రీ తండ్రీ కొడుకులు, వాటి ద్వారా కల్తీ వస్తువులను తయారు చేసి, బ్రాండెట్ ప్యాకింగ్ చేసి తిరిగి విక్రయిస్తున్నారు. హోల్ సేల్ నిత్యావసర సామాగ్రి వ్యాపారం పేరుతో కల్తీ వస్తువులకు తెరలేపిన ఇద్దరు తండ్రీ, కుమారులను మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 5వేల లీటర్ల కల్తీ వంటనూనె, 5వేల కిలోల గడువు ముగిసిన గోదుమపిండిని స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... రాజస్థాన్ నుంచి నగరానికి వచ్చి వట్టినాగులపల్లిలో స్థిరపడిన భన్వర్ రామ్ జాట్ (46), అతని కుమారుడు అశోక్ కుమార్ లు స్థానికంగా శ్రీ జన్నాత్ ట్రేడర్స్ దుకాణం నిర్వహిస్తున్నారు. వీరు సులభంగా డబ్బు సంపాదించడం కోసం కల్తీ దందాకు తెరలేపారు. గడువు ముగిసిన వంట నూనెలను సేకరించి, సోయాబిన్ నూనెతో వాటిని కలిపి కల్తీ వంట నూనెను తయారు చేస్తున్నారు. ఈ నూనెను మార్కెట్లో ఉన్న ప్రముఖ బ్రాండ్ల పేరుతో ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. దీంతో పాటు గడువు తీరిన గోదుమ పిండిని పలు ప్రాంతాల నుంచి సేకరించి, అదే పిండిని జన్నాత్ గోల్డ్ చక్కీ అటా పేరుతో ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. వీరి దందాపై సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు దుకాణం మీద సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10 లక్షల రూపాయల విలువైన 5026లీటర్ల కల్తీ నూనె, 3లక్షల రూపాయల విలువైన 5192 కిలోల గోధుమ పిండిని స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు ప్యాకింగ్ సామాగ్రిని సైతం స్వాధీనం చేసుకొని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. గచ్చిబౌలి పోలీసులు నిందితుల మీద కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో పాటు దర్యాపు చేపట్టారు.

## నల్లగండ్ల డివిజన్ సమస్యలపై
# అధికారులను కలిసిన రాగం హరిశంకర్ యాదవ్


ప్రజావాణిలో సమస్యలపై ఫిర్యాదు చేస్తున్న హరిశంకర్ యాదవ్



గచ్చిబౌలి ఇనిస్పెక్టర్ ను కలిసిన రాగం హరిశంకర్ యాదవ్

**వీధి దీపాలు, విద్యుత్ మీటర్లు, సీసీ కెమెరాల సమస్యలు పరిష్కరించాలని వినతి**

ఈకబురు, శేరిలింగంపల్లి : నల్లగండ్ల డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక బీఆర్ఎస్ నాయకులు రాగం హరిశంకర్ యాదవ్ సోమవారం అధికారులను కలిసి విన్నవించారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం శేరిలింగంపల్లి జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులను కలిసిన హరిశంకర్ యాదవ్ ప్రజా సమస్యలపై ఫిర్యాదులు చేశారు. దీంతో పాటు సీసీ కెమెరాల సమస్యలపై గచ్చిబౌలి ఇనిస్పెక్టర్ ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా హరిశంకర్ యాదవ్ మాట్లాడుతూ నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి ప్రాంతంలో వీధి దీపాలు పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీంతోపాటు వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, రాత్రి వేళల్లో ప్రయాణికులు వీధి కుక్కల కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. విద్యుత్ మీటర్ల నిలిపివేతతో భవన యజమానులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే విద్యుత్ మీటర్లను మంజూరు చేయాలని కోరారు. అనంతరం గచ్చిబౌలి ఇనిస్పెక్టర్ బాలరాజును కలిసిన హరిశంకర్ యాదవ్ గౌలిదొడ్డిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ.రవికుమార్, బి.అరుణ్, ఎం.సాయినాథ్, ఈ.నరేష్, వై.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## జుట్టు పెరిగిందని విద్యార్థికి ట్రిమ్మింగ్
# చేయించిన ఉపాధ్యాయుడు

**హఫీజ్ పేట్ ప్రైవేటు స్కూల్ లో వివాదం**

ఈకబురు, శేరిలింగంపల్లి : జట్టు పెంచుకొని స్కూల్ కు వచ్చిన ఓ విద్యార్థికి ఉపాధ్యాయుడు ట్రిమ్మింగ్ చేయించడం వివాదానికి కారణమైంది. దేవుని మొక్కుగా జుట్టు పెంచామని, ఉపాధ్యాయుడు అత్యుత్సాహం ప్రదర్శించాడంటూ విద్యార్థి సంమాలతో కలిసి స్కూల్ ముందు తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. దీంతో స్కూల్ యజమాన్యం కల్పించుకొని ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించడంతో వివాదం సద్దుమణిగింది. హఫీజ్ పేట్ లో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... న్యూ హఫీజ్ పేట్ ప్రేమ్ నగర్ లో గల బ్లాక్ బోర్డు ది స్కూల్ లో ఈశ్వర్ అనే విద్యార్థి 9వ తరగతి చదువుతున్నాడు. ఈశ్వర్ తన జుట్టు ఎక్కువగా పెంచుకొని స్కూల్ కు వస్తుండడంతో పలుమార్లు మందలించిన ఉపాధ్యాయుడు ఈనెల 7వ తేదీన బాలుడి జుట్టుకు ట్రిమ్మింగ్ చేయించాడు. ఈ విషయం వివాదస్పదంగా మారింది. తమ కుమారుడి జుట్టుపై దేవుడి మొక్కు ఉందని, తమను సంప్రదించకుండా ఉపాధ్యాయుడు ట్రిమ్మింగ్ చేయించడంపై విద్యార్థి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాలతో కలిసి పాఠశాల ముందు ఆందోళన చేపట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఈ విషయమై స్కూల్ యజమాన్యం కల్పించుకొని సంఘటనపై విచారం వ్యక్తం చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు ఘటనకు కారణమైన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు స్కూల్ యజమాన్యం ప్రకటించడంతో వివాదం సద్దుమణిగింది. కాగా ఈ విషయమై ఎటువంటి పిర్యాదు అందలేదని మియాపూర్ పోలీసులు తెలిపారు.

# తెలంగాణ సమస్యలను దిల్లీలో వినిపిస్తా:
# వేం నరేందర్‌రెడ్డి

ఈ సందర్భంగా వేం నరేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిన ఏఐసీసీ పెద్దలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ సమస్యలను రాజ్యసభలో, దిల్లీలో వినిపిస్తానని పేర్కొన్నారు. వాటిని పరిష్కరించే విధంగా కేంద్రంపై ఒత్తిడి తెస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే అనుభవం గల సభ్యులు రాజ్యసభలో అడుగుపెడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# యాసిడ్ దాడి బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు

ఈ కబురు : యాసిడ్ దాడుల బాధితులకు పరిహారం కల్పించే విషయంలో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులిచ్చింది. బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేలా విధానాన్ని రూపొందించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఒకవేళ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వలేని పక్షంలో.. బాధితుల జీవనాధారం కోసం భత్యం చెల్లించేలా విధానాలు రూపొందించాలని సూచించింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. యాసిడ్ దాడి బాధితులకు ప్రభుత్వ విభాగాలు/ఏజెన్సీల్లో ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేరో స్పష్టమైన కారణాలు తెలియజేయాలని సుప్రీంకోర్టు రాష్ట్రాలను ఆదేశించింది. యాసిడ్ దాడుల కేసులకు సంబంధించి గతంలోనూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనల్లో నేరగాళ్లకు తీవ్రమైన కఠిన శిక్షలు విధించేలా చట్టాన్ని సవరించాలని నాడు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. అవసరమైతే దోషుల ఆస్తులను ఎందుకు స్వాధీనం చేసుకోకూడదని ప్రశ్నించింది. హరియాణాకు చెందిన ఓ యాసిడ్ దాడి బాధితురాలి పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

# ప్యాచ్ వర్క్ చేయమంటే రోడ్డు మొత్తం తవ్వేశారు


అధికారులు తవ్వి వదిలేసిన రామకృష్ణ నగర్ సీసీ రోడ్డు
అధికారులు తవ్వి వదిలేసిన రామకృష్ణ నగర్ సీసీ రోడ్డు
దుకాణాల ముందు కుప్పలుగా సీసీ రోడ్డు శిథిలాలు

**మధీనగూడలో సీఎంసీ అధికారుల నిర్లక్ష్యం**
**విజిలెన్స్ చెంతకు " మియాపూర్ సర్కిల్ అధికారుల నిర్వాకం"**
**తిరిగి రోడ్డు వేయాలంటే లక్షలు వెచ్చించాల్సిందే..**

ఈకబురు, శేరిలింగంపల్లి : "" చూసి రమ్మంటే కాల్చి వచ్చినట్లుగా ఉంది సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల తీరు... చిన్న ప్యాచ్ వర్క్ పని చేయాల్సిన చోట ఏకంగా 200 మీటర్ల సిసి రోడ్డును ఎడాపడా తవ్వి పడేశారు... సీసీ రోడ్డును మొత్తం బద్దలు కొట్టిన తర్వాత జరిగిన తప్పు పై నాలుక కరుచుకొని నెల రోజులుగా రోడ్డును ముట్టుకోకుండా వదిలేశారు... కాలనీకి వచ్చే ప్రధాన రహదారి మూసుకుపోయి నెల రోజులుగా ఓ వైపు ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, తిరిగి రోడ్డు నిర్మాణం చేపట్టాలంటే లక్షల ప్రజాధనం వెచ్చించాల్సి వస్తుంది...
ఎటువంటి వర్క్ ఆర్డర్ లేకుండా నిర్లక్ష్యంగా రహదారిని తవ్విన విషయం విజిలెన్స్ విభాగం చెంతకు చేరడంతో ఏ అధికారిపై వేటు పడుతుందో తెలియని పరిస్థితి ఉంది..""
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మియాపూర్ సర్కిల్ అధికారుల నిర్లక్ష్యంపై
ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. నీళ్లు నిలుస్తున్నాయని సిసి రోడ్డుకు చిన్న ప్యాచ్ వర్క్ చేయాల్సింది పోయి పొరపాటున రోడ్డు మొత్తం తవ్వేయడం సర్కిల్ అధికారులకే చెల్లింది. మియాపూర్ సర్కిల్ పరిధిలోని మదీనాగూడ రామకృష్ణ నగర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి సిసి రోడ్డును నెల రోజుల క్రితం అధికారులు దాదాపు 200 మీటర్లు తవ్వారు. లక్షణంగా ఉన్న రోడ్డును ఎడాపెడా తవ్విన తరువాత నాలుక కర్చుకున్న అధికారులు నెల రోజులుగా తవ్విన రోడ్డును పట్టించుకోకుండా వదిలేశారు. వర్క్ ఆర్డర్ లేకుండా ప్యాచ్ వర్క్ చేయాల్సిన రోడ్డును మొత్తం తవ్వి తిరిగి రోడ్డు వేసేందుకు ప్రయత్నించడం అనుమానాలకు తావిస్తుండగా, అధికారుల వింత పోకడ విజిలెన్స్ చెంతకు చేరడం వివాదాస్పదంగా మారింది. తమ నిర్లక్ష్యం సర్కిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఎవరి మెడకు చుట్టుకుంటుందో అని ఓవైపు అధికారుల్లో భయాందోళన ఉండగా, మరోవైపు నెల రోజులుగా కాలనీకి వెళ్లే రహదారి మూసుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఇళ్లలో ఉన్న వాహనాలను సైతం బయటకు తీసే సమయం ఇవ్వకుండా రోడ్డును తవ్వి నెలరోజులుగా నిర్లక్ష్యంగా వదిలేసిన అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరిగి రోడ్డు నిర్మాణం చేపట్టాలంటే లక్షల్లో నిధులు వెచ్చించాల్సి రావడంతో స్థానిక ప్రజాప్రతినిధులు సైతం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# క్రీడా ప్రణాళిక సిద్ధం చేయాలి.. సీఎం రేవంత్



ఒలింపిక్స్, కామన్‌వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యమిచ్చేలా, ఒలంపిక్స్‌లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటడమే లక్ష్యంగా క్రీడా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. క్రీడలకు అవసరమైన మైదానాలు, యూనివర్సిటీ, శిక్షణ తదితర అంశాలపై క్రీడాశాఖకు సంబంధించి ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. రాష్ట్రంలో తలపెట్టిన యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన మైదానాలతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడంపై చర్చించారు. ఈ సందర్భంగా నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి గారు అధికారులకు పలు సూచనలు చేశారు. గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియంను పునరుద్ధరించడంతో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్‌నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, క్రీడాకారులకు శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి , యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కిషోర్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌పీజీ సిలిండర్ బుకింగ్ గడువు పెంపు



ఎల్‌పీజీ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్‌ను నివారించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సిలిండర్‌కు సిలిండర్‌కు మధ్య ఉన్న బుకింగ్ గడువును 21 నుంచి 25 రోజులకు పెంచింది. సిలిండర్లకు కొరత ఏర్పడొచ్చన్న భయాలతో కొందరు ముందస్తుగా గ్యాస్ బుక్ చేస్తున్నారు. గతంలో సగటున 55 రోజులకోసారి సిలిండర్ బుక్ చేసుకునే వాళ్లు సైతం ప్రస్తుత పరిస్థితుల్లో 15 రోజులకే బుక్ చేస్తుండడం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో 21 రోజుల లాకిన్ నిబంధన తీసుకొచ్చారు. తాజాగా ఆ గడువును 25 రోజులకు పెంచారు. ఇళ్లలో వినియోగించే వంటగ్యాస్ సిలిండర్‌పై కేంద్రం ఇటీవల రూ.60 భారం మోపింది. వాణిజ్య సిలిండర్లపై రూ.114.5 పెంచింది. మరోవైపు గృహ వినియోగదారుల ఎల్‌పీజీ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, కమర్షియల్ వినియోగదారులకంటే గృహ వినియోగదారులకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయిల్ రిఫైనరీలకు కేంద్రం సూచించింది. ఎల్‌పీజీ విక్రయానికి అల్జీరియా, ఆస్ట్రేలియా, కెనడా, నార్వే వంటి దేశాలు ముందుకొచ్చాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పటికీ ఇప్పటికిప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే అవకాశం లేదని పేర్కొన్నాయి. ప్రస్తుతానికి దేశంలో సరిపడా పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ నిల్వలు ఉన్నాయని వెల్లడించాయి.

## వార్ ఎఫెక్ట్.. 100 డాలర్ల మార్క్ దాటిన ముడిచమురు



పశ్చిమాసియా ఘర్షణలతో ప్రపంచ ఇంధన సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. దాంతో చమురు ధరలు (Oil prices) భగ్గుమంటున్నాయి. తాజాగా బ్యారెల్ ముడిచమురు ధర 100 డాలర్ల మార్క్ దాటేసింది. మూడున్నరేళ్లలో ఒక బ్యారెల్ ధర ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. అమెరికా చమురు ధరలకు బెంచ్‌మార్క్‌గా ఉన్న వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర 106.22 డాలర్లు పలుకుతోంది. శుక్రవారం మార్కెట్లు ముగిసినప్పుడు ఆ రేటు 90.90 డాలర్లుగా ఉండగా.. తాజాగా 16.9 శాతం పెరిగింది. షికాగో మెర్కంటైల్ ఎక్స్ఛేంజీలో ట్రేడింగ్ ప్రారంభమైన తర్వాత బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 16.5 శాతం పెరిగి.. 107.97 డాలర్లకు ఎగబాకింది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 115 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. గతవారం అమెరికా క్రూడ్ ధర 36 శాతం, బ్రెంట్ క్రూడ్ 26 శాతం పెరిగాయి. ఆ ఎఫెక్టే ట్రేడింగ్‌లో కనిపించింది.

ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్‌అమెరికా, ఇరాన్ మధ్య మొదలైన యుద్ధం రెండో వారమూ కొనసాగుతోంది. దాంతో పశ్చిమాసియాలో చమురు ఉత్పత్తి, షిప్పింగ్‌కు అంతరాయం కలుగుతోంది. మరోవైపు హర్మూజ్ జలసంధిని మూసివేశామని, నౌకలు దానిని దాటడానికి ప్రయత్నిస్తే నిప్పు పెడతామని ఇరాన్ (Iran) హెచ్చరించిన సంగతి తెలిసిందే. హర్మూజ్ ప్రపంచ ఇంధనానికి జీవనాడి వంటిది. కేవలం కొన్ని కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ జలసంధి నుంచి ప్రపంచం వాడే చమురులో ఐదోవంతు రవాణా అవుతోంది. ఇప్పుడు ఈ రవాణాకు ఆటంకం ఏర్పడింది.

ధరలు పెరుగుదల తాత్కాలికమే: ట్రంప్

చమురు ధరలు 100 డాలర్ల మార్క్ దాటి.. 120 డాలర్లకు చేరువవుతోంది. దాంతో అంతర్జాతీయ మార్కెట్లు భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఇలాంటి సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోస్టు పెట్టారు. ఇది అణుముప్పును తొలగించేందుకు నిరాకరించినందుకు ఇరాన్ చెల్లిస్తున్న చిన్న మూల్యమని అన్నారు. ఈ ధరల పెరుగుదల తాత్కాలికమేనని.. ఆ ముప్పు తొలగిన తర్వాత ధరలు భారీగా పడిపోతాయని చెప్పారు. తెలివితక్కువవారే దీనికంటే భిన్నంగా ఆలోచిస్తారని వ్యాఖ్యలు చేశారు.

## ఓలా ఛాంపియన్ మహోత్సవ్.. ఈవీలపై ₹10వేల ప్రయోజనాలు!




ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన సంస్థ ఓలా ఎలక్ట్రిక్ కస్టమర్లను ఆకర్షించడంలో భాగంగా మరో ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. టీ20 ప్రపంచకప్‌లో భారత్ విశ్వవిజేతగా నిలిచిన నేపథ్యంలో 'ఛాంపియన్ మహోత్సవ్'ను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఓలాకు చెందిన అన్ని వాహనాలపై రూ.10 వేల విలువైన ప్రయోజనాలను అందిస్తోంది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఈ ఆఫర్ అందుబాటులో ఉండనుంది. ఈ ఆఫర్‌లో భాగంగా ఓలా కంపెనీకి చెందిన స్కూటర్లు, రోడ్‌స్టర్ మోటార్ సైకిల్ కొనుగోళ్లపై ఈ ప్రయోజనాలను అందించనుంది. "టీ20 వరల్డ్‌కప్‌లో మూడోసారి టీంఇండియా కప్ గెలిచి చరిత్ర సృష్టించింది. ఈ ఉత్సవాల్లో కంపెనీ భాగం కావాలనుకుంటోంది. అందుకే ఛాంపియన్ ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నాం" అని ఓలా ఓ ప్రకటనలో పేర్కొంది.

## మైనస్ 2496 నుంచి 1352కు సెన్సెక్స్..

# భారీ నష్టాల్లో స్వల్ప ఊరట!




ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పెరగడం, పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు ఇంకెంత కాలం కొనసాగుతాయోనన్న భయాందోళనలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్ సూచీలూ భారీగా పతనమయ్యాయి. ఇంట్రాడేలో దాదాపు 2,496 పాయింట్లు పతనమైన సెన్సెక్స్.. 1352 పాయింట్ల నష్టంతో గట్టెక్కింది. నష్టాలను దాదాపు సగానికి తగ్గించుకోవడం ఊరట కల్పించే విషయం.

సూచీల గమనం ఇలా..

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 1862 పాయింట్ల నష్టంతో 77,056.75 వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,424.55 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1352.74 పాయింట్ల నష్టంతో 77,566.16 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఓ దశలో 23,697.80 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 422.40 పాయింట్ల నష్టంతో 24,028.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 53 పైసలు క్షీణించి 92.35గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్ సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా స్టాక్స్ మాత్రమే రాణించాయి. అల్ట్రాటెక్ సిమెంట్, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్‌బీఐ, అదానీ పోర్ట్స్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 104.62 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5108 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. నిన్నటి అమెరికన్ మార్కెట్లతో పాటు నేటి ఆసియా మార్కెట్లూ నష్టపోయాయి. దక్షిణ కొరియా కోస్పి, జపాన్ నిక్కీ భారీ నష్టాలు చవిచూశాయి.

కారణాలు ఇవీ..

అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపాయి.

యుద్ధ భయాల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. భారత్ తన చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతి చేసుకుంటుంది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న భయాలు నెలకొన్నాయి.

అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ సైతం కనిష్ఠాన్ని చేరుకోవడం ప్రతికూల ప్రభావం చూపింది.

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత మార్కెట్ల నుంచి నిధులు తరలిస్తూనే ఉన్నారు. శుక్రవారం కూడా రూ.6,030.38 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు.

రాణించిన ఐటీ స్టాక్స్

భారీ నష్టాల వేళ ఐటీ స్టాక్స్ నేడు రాణించాయి. విప్రో, ఎల్‌టీఎం, పెర్సిస్టెంట్ సిస్టమ్స్, కోఫోర్జ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ స్టాక్స్ లాభపడ్డాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనం కావడం ఈ స్టాక్స్‌కు కలిసొచ్చింది. ఆయా కంపెనీలకు ఆదాయం డాలర్లలో ఉండడం, ఖర్చులు రూపాయల్లో ఉండడం ఇందుక్కారణం. దీనికితోడు గత నెల ఐటీ స్టాక్స్ భారీగా పతనమైన నేపథ్యంలో కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు కనిపించింది.

## మండే బ్లడ్‌బాత్: ముంచిన చమురు ధరలు.. రూ.12 లక్షల కోట్లు ఆవిరి



అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో దేశీయ మార్కెట్లు భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో 2 వేల పాయింట్లకు పైగా పతనం కాగా.. నిఫ్టీ 24 వేల మార్కు దిగువన కొనసాగుతోంది. మదుపర్ల సంపద దాదాపు రూ.12 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీ మొత్తం విలువ రూ.438 లక్షల కోట్లకు చేరింది.

మధ్యాహ్నం 12.30 గంటల సమయానికి సెన్సెక్స్ 1,906 పాయింట్ల మేర క్షీణించి 77,011.97 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 585.35 పాయింట్లు పతనమై 23,865.10 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ విపణిలో రూపాయి విలువ పడిపోయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 92.25 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్ 30 సూచీలో అన్ని స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఎస్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతీ సుజుకీ, ఇండిగో స్టాక్స్ దాదాపు 5 శాతం వరకు నష్టాల్లో కొనసాగుతున్నాయి.

అంతర్జాతీయ మార్కెట్లూ నష్టాల్లోనే..

నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 5.6 శాతం, నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 4 శాతానికి పైగా పడిపోయాయి. నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 2.9 శాతం మేర క్షీణించింది. రియల్టీ, లోహ రంగాల్లోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి. మార్కెట్ అస్థిరతను కొలిచే విక్స్ 20 శాతానికి పైగా పెరిగి, 24.01కి చేరింది. మరోవైపు ఆసియా మార్కెట్లు కూడా భారీ నష్టాల్లో ఉన్నాయి. దక్షిణకొరియా కోస్పి.. వరుసగా నాలుగు సెషన్లలో రెండోసారి సర్క్యూట్ బ్రేకర్‌ను యాక్టివేట్ చేసింది. ఈ సూచీ 8 శాతం పడిపోవడంతో 20 నిమిషాల పాటు ట్రేడింగ్‌ను నిలిపేశారు. జపాన్ నిక్కీ ఏడు శాతం మేర క్షీణించింది. శుక్రవారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. నేటి ట్రేడింగ్‌లో ఆసియా సూచీలన్నీ అదే బాటలో కొనసాగుతున్నాయి. అమెరికాకు డో ఫ్యూచర్స్ వెయ్యి పాయింట్లు పడింది.

ఆయిల్ షాక్..

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో అంతర్జాతీయ చమురు ధరలు ఒక బ్యారెల్‌కు 100 డాలర్ల మార్క్ దాటాయి. దాంతో మదుపర్లు అమ్మకాలకు దిగారు. ద్రవ్యోల్బణ భయాలు అందుకు దోహదం చేశాయి. ఈ ఉద్రిక్తతలు ఎక్కువకాలం కొనసాగితే.. అది పెద్దచమురు దిగుమతిదారుల్లో ఒకటైన భారత్‌పై పెను ప్రభావం ఉంటుందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు చెందిన వీకే విజయ్ కుమార్ వెల్లడించారు.

ఎఫ్ఐఐలు వెనక్కి..

మన మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు (FII) తమ వాటాలను వెనక్కి తీసుకోవడం కొనసాగుతోంది. ఒక్క శుక్రవారమే 6,030 కోట్ల మేర ఉపసంహరించుకున్నారు.

## స్విగ్గీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొత్త క్రెడిట్‌కార్డ్స్.. ఏడాదికి ₹48 వేలు ఆదా!

**ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాం స్విగ్గీ, ప్రైవేట్‌రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీ మరోసారి జట్టుకట్టాయి. 2023లో తొలిసారి కో -బ్రాండెడ్ క్రెడిట్ కార్డును లాంచ్ చేసిన ఈ రెండు సంస్థలు.. తమ పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తూ మరో రెండు కో-బ్రాండెడ్ క్రెడిట్‌కార్డులను తీసుకొచ్చాయి. ట్రావెల్ బుకింగ్, ఆన్‌లైన్ షాపింగ్, క్విక్‌కామర్స్, ఫుడ్ డెలివరీ కేటగిరీల్లో లావాదేవీలపై డిస్కౌంట్, క్యాష్‌బ్యాక్‌ను అందిస్తున్నాయి. వినియోగాన్ని బట్టి ఏటా గరిష్ఠంగా రూ.48 వేల వరకు ఆదా చేసుకోవచ్చని ఇరు సంస్థలు ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి.**

**స్విగ్గీ BLCK హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్, స్విగ్గీ ఆరెంజ్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు క్రెడిట్ కార్డు పేరిట ఈ కార్డులను తీసుకొచ్చారు. స్విగ్గీతో పాటు ఆన్‌లైన్ ట్రావెల్ సంస్థ క్లియర్‌ట్రిప్, సౌందర్య, సంరక్షణ ఉత్పత్తుల సంస్థ నైకాలో కొనుగోళ్లపై డిస్కౌంట్, క్యాష్‌బ్యాక్ లభిస్తాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మింత్రా యాప్‌లో కొనుగోళ్లపైనా కూడా క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలు లభిస్తాయి.**

**క్లియర్‌ట్రిప్ 19 శాతం, హోటల్ బుకింగ్స్‌పై 6 శాతం, ఫ్లైట్ బుకింగ్స్‌పై 5 శాతం, నైకా ఉత్పత్తుల కొనుగోళ్లపై 5 డిస్కౌంట్ 5 శాతం క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. స్విగ్గీలో కొనుగోళ్లకు బ్లాక్ కార్డు హోల్డర్లకు 10 శాతం, ఆరెంజ్ హోల్డర్లకు 5 శాతం క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. రూ.500 జాయినింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. స్విగ్గీ మొబైల్ యాప్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు. దశలవారీగా ఈ కార్డులను అందుబాటులోకి తేనున్నారు.**



## ప్రేమ గురించి ఎప్పుడూ ఇదే మాట చెబుతా: రష్మిక



గత నెలలో వివాహబంధంలోకి అడుగుపెట్టిన రష్మిక తాజాగా ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌కు స్పందించారు. రష్మిక (Rashmika), విజయ్ దేవరకొండ సినిమాలు, వారి ప్రేమ ప్రయాణం, వివాహం గురించి ఓ నెటిజన్ తన బ్లాగ్‌లో రాసుకొచ్చారు. దానికి రష్మిక స్పందిస్తూ ప్రేమ గురించి మాట్లాడారు. అది చదివిన తర్వాత భావోద్వేగానికి గురైనట్లు చెప్పారు. “చాలా రోజుల తర్వాత నా గురించి రాసిన ఆర్టికల్ చదివి ఎమోషనల్ అయ్యాను. ఎంతో చెప్పాలని ఉంది. కానీ, మాటలు రావడం లేదు. ప్రస్తుతం నాకంటూ ప్రత్యేక స్థానాన్ని వెతుక్కునే ప్రయాణంలో ఆనందంగా ఉన్నాను. దాన్ని గుర్తించి ఇంత అందంగా వివరించినందుకు ధన్యవాదాలు. ప్రేమ గురించి నేను చెప్పే మాట ఎప్పుడూ ఒక్కటే.. మిమ్మల్ని స్వేచ్ఛగా ఉండనిచ్చే ప్రేమను వెతుక్కోండి” అని రష్మిక అన్నారు.

రష్మిక, విజయ్ దేవరకొండ (Vijay Deverakonda) ఫిబ్రవరి 26న ఉదయ్‌పుర్ వేదికగా ఒక్కటయ్యారు. వారం రోజులు వరుస వేడుకలు చేసుకున్న అనంతరం తిరిగి వర్క్‌లైఫ్‌లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. వీరిద్దరి కాంబినేషన్‌లో ‘రణబాలి’ రానున్న విషయం తెలిసిందే.



## ‘జన నాయగన్’ మరింత ఆలస్యం

విజయ్ (Vijay) హీరోగా తెరకెక్కిన ‘జన నాయగన్’ (Jana Nayagan) సినిమా విడుదలకు చిక్కులు తప్పడం లేదు. జనవరిలో ప్రేక్షకుల ముందుకురావాల్సిన ఈ చిత్రం చట్టపరమైన సమస్యలు ఎదురుకావడంతో చివరి నిమిషంలో వాయిదా పడింది. ప్రస్తుతం దీన్ని రివైజింగ్ కమిటీకి పంపిన విషయం తెలిసిందే. సెన్సార్ సర్టిఫికెట్ కోసం నేడు ఈ సినిమాను సీబీఎఫ్‌సీ రివైజ్ కమిటీ వీక్షించాల్సి ఉంది. అయితే, కమిటీలో ఓ సభ్యుడి అనారోగ్యం కారణంగా చివరి నిమిషంలో స్క్రీనింగ్ వాయిదా పడింది. తదుపరి తేదీ కూడా చెప్పకపోవడంతో దీని విడుదల మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.
అన్ని సమస్యలు తీరితే ఫిబ్రవరిలో దీన్ని విడుదల చేయాలని చిత్రబృందం భావించింది. ఆతర్వాత ఏప్రిల్‌లో రిలీజ్‌కు ప్లాన్ చేసింది. ఇంకా రివ్యూ కమిటీ వీక్షించి రిపోర్ట్ ఇవ్వకపోవడంతో ఏప్రిల్‌లో కూడా సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. మరోవైపు విజయ్ పుట్టినరోజు నాడు దీన్ని ప్రేక్షకుల ముందుకుతీసుకురావాలనే ఆలోచన ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. జూన్ 22న ఆయన పుట్టినరోజు కావడంతో జూన్ 18న దీన్ని రిలీజ్ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

### చేయని పోస్ట్ కు సారా అర్జున్‌పై ట్రోలింగ్..

# వివరణ ఇచ్చిన ఆమె తండ్రి



ప్రస్తుతం సోషల్‌మీడియా యుగంలో ఏ చిన్న మాట తప్పుగా దొర్లినా దారుణంగా ట్రోలింగ్ ఎదుర్కోవాల్సిన పరిస్థితి. ఇటీవల కాలంలో ఈ ఉదంతాలు కోకొల్లలు. ప్రస్తుతం ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు నటి సారా అర్జున్ (Sara Arjun). ‘ధురంధర్’తో (Dhurandhar) బాలీవుడ్‌లో మంచి క్రేజ్ సొంతం చేసుకున్న బ్యూటీ చేయని పోస్ట్‌కు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

**ఇంతకీ ఏం జరిగిందంటే..**

రణ్‌వీర్ సింగ్ (Ranveer Singh) కథానాయకుడిగా ఆదిత్యధర్ దర్శకత్వంలో రూపొందిన ‘ధురంధర్’లో (Dhurandhar) సారా అర్జున్ ఎలినా జమాలిగా అందంతో కట్టిపడేసింది. దీనికి కొనసాగింపుగా ‘ధురంధర్2’ మార్చి 19న రానుంది. ట్రైలర్ విడుదల సందర్భంగా ఎక్స్ వేదికగా పంచుకుంటూ ‘నో టాక్సిటీ.. ఓన్లీ ధురంధర్’ అని పోస్ట్ పెట్టారు. దీనిపై యశ్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమెపై ట్రోలింగ్ మొదలు పెట్టారు. ‘టాక్సిక్’ విడుదల వాయిదా పడటంతో సారా ఇలా కించపరిచేలా పోస్ట్ పెట్టారని మండిపడ్డారు. ఇంతకీ అసలు విషయం ఏంటంటే, ఇప్పటివరకూ సారా అర్జున్‌కు ఎక్స్‌లో ఖాతానే లేదట. ఎవరో అభిమాని క్రియేట్ చేసిన ఖాతాను పట్టుకుని సారాపై విమర్శలు గుప్పిస్తుండటంతో ఆమె తండ్రి రాజ్ అర్జున్ స్పందించారు.

“మేమంతా సినిమా కుటుంబానికి చెందిన వాళ్లం. మాది పెద్ద కుటుంబం. ప్రతి నటుడు, నటి, చిత్రంపై సారా అర్జున్‌కు అపారమైన గౌరవం ఉంది. ఇతరులను కించపరుస్తూ ఎప్పుడూ మాట్లాడదు. ఒకవేళ తాను ప్రచారం చేసుకోవాలనుకున్నా, ఇతరులను మాత్రం తక్కువ చేసి మాట్లాడదు. సారా కేవలం ఇన్‌స్టాగ్రామ్‌లో మాత్రమే ఉంది. అది కాకుండా ఇతర ఏ సోషల్‌మీడియా వేదికల్లో ఖాతాలున్నా అవన్నీ ఫేక్. ఇలాంటి పోస్ట్‌లను దయచేసి ప్రచారం చేయొద్దు” అని రాజ్ అర్జున్ పేర్కొన్నారు.

**‘ధురంధర్2’లో మరింత ప్రాధాన్యం?**

‘ధురంధర్’లో హమ్జా (రణ్‌వీర్) గర్ల్ ఫ్రెండ్ ఎలీనాగా ఆకట్టుకుంది. అయితే, మొదటి భాగంలో పూర్తి ప్రాధాన్యం దక్కలేదు. కానీ, ట్రైలర్‌లో ఆమెకు సంబంధించిన ఓ సన్నివేశం చూస్తే, పార్ట్2లో ఆమె పాత్రకు కాస్త ప్రాధాన్యం ఇచ్చినట్లే కనపడుతోంది. హమ్జాకు తుపాకీ గురిపెడుతూ కనిపించింది. అంటే హమ్జా ఇండియన్ స్పై అని తెలిసి ఉండాలి. ఆ విషయం బయటపడిన తర్వాత ఎలీనా ఎలాంటి నిర్ణయం తీసుకున్నదనే దానిపై స్పష్టత రావాలంటే మార్చి 19వ తేదీ వరకూ వేచి చూడాల్సిందే.

## ఒక పద్ధతి.. ఒక ప్లానింగ్.. ఒక విజన్.. అడ్వాన్స్ బుకింగ్స్ లో ‘ధురంధర్2’ రికార్డులు




అద్భుతం జరిగేటప్పుడు ఎవ్వరూ గుర్తించరు. జరిగిన తర్వాత ఎవరూ గుర్తించాల్సిన అవసరం లేదు’ అంటారు త్రివిక్రమ్ ‘ఖలేజా’ సినిమాలో..! అచ్చం ఇలాగే ‘ధురంధర్’ ఒక సాధారణ యాక్షన్ థ్రిల్లర్‌లా ప్రేక్షకుల ముందుకు వచ్చి, అసాధారణ వసూళ్లతో రికార్డులు సృష్టించింది. ఆదిత్య ధర్ (dhurandhar director) టేకింగ్, రణ్‌వీర్ సింగ్ (Ranveer Singh) నటనకు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నా, ‘పాన్ ఇండియా’ అంటూ పాకులాడే ప్రయత్నం చేయలేదు. ఇతర ఏ భాషల్లోనూ డబ్బింగ్ చేయలేదు. ఫలితం.. ఫుల్ రన్ ముగిసే సమయానికి రూ. 1300కోట్లకు పైగా వసూళ్లు. అంతేకాదు, మార్చి 2026 (dhurandhar 2 release date) ‘ధురంధర్2’ అంటూ సినిమా చివరిలో ప్రకటన. ఇది చూసి పెదవి విరిచిన ప్రేక్షకులే ఎక్కువే. ఎందుకంటే ఇటీవల కాలంలో ‘పార్ట్2’ అంటూ ప్రకటించిన సినిమాల స్థితి, పరిస్థితి ఏంటో ప్రతి ఒక్కరూ చూస్తూనే ఉన్నారు. కానీ, ఆదిత్యధర్ ప్లానింగ్ వేరు. కాదు, కంటెంట్‌పై నమ్మకం.

**ఇదీ ప్లానింగ్.. పద్ధతి అంటే..**

‘ధురంధర్’ రెండు భాగాలకు సంబంధించిన షూటింగ్ మొత్తం దాదాపు ఒకేసారి పూర్తి చేశారు.
మొదటి పార్ట్‌కు వచ్చిన హైప్‌ను దృష్టిలో పెట్టుకుని రెండో భాగంలో పెద్దగా మార్పుల జోలికి పోలేదు. చాలా చిన్న చిన్న మార్పులు మాత్రమే చేశారట.
మొదటి పార్ట్ విడుదలైన మూడు నెలలకు రెండో భాగాన్ని తీసుకొచ్చేలా ప్రణాళికకు అనుగుణంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేశారు.
‘ధురంధర్’ పెంచిన అంచనాలను దృష్టిలో పెట్టుకుని పార్ట్2 విషయంలో ఎక్కువ హడావిడి లేదు. టూర్‌లు, ఇంటర్వ్యూలు, అంటూ భారీ ప్రచారాలు చేయలేదు.
సాధారణంగా మొదటి పార్ట్ విజయవంతమైతే రెండో భాగానికి సంబంధించిన టీజర్, ట్రైలర్‌లను చూసేందుకు ప్రేక్షకులు ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. ఇక్కడే తెలుగు సహా ఇతర చిత్ర బృందాలు తడబడుతున్నాయి. ఈ విషయంలో ‘ధురంధర్’ టీమ్ అడుగు వెనక్కి వేయలేదు.
సాంకేతిక సమస్యలు అంటూ ట్రైలర్ కోసం గంటల గంటలు సోషల్‌మీడియాలో అభిమానులు వేచి చూసేలా చేయలేదు. అనుకున్న సమయానికి హిందీ ట్రైలర్ విడుదల చేశారు. కాకపోతే ఒక్కరోజు ఆలస్యంగా ఇతర భాషల ట్రైలర్‌లు విడుదల చేశారు.

## ఆసియాలోనే అతిపెద్ద డాల్బీ సినిమా థియేటర్.. ఇప్పుడు హైదరాబాద్‌లో..!




ఓటీటీలు రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలో అద్భుతమైన కథ, కథనాలు లార్జర్ దేన్ లైఫ్ ఎలిమెంట్స్ ఉంటేనే ప్రేక్షకుడు థియేటర్‌కు వస్తున్నాడు. తెలుగు సినీ పరిశ్రమ సైతం సరికొత్త హంగులతో సినిమాలను తీర్చిదిద్దుతోంది. అధునాతన సాంకేతికత సాయంతో సినిమాలను రూపొందిస్తూ తెలుగు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేస్తోంది. ఇప్పటికే రామోజీ ఫిల్మ్‌సిటీ (Ramoji Film City) వంటి ప్రపంచస్థాయి స్టూడియోలకు నెలవైన హైదరాబాద్‌లో ఇటీవలే మోషన్ క్యాప్చర్ టెక్నాలజీని తీసుకొచ్చారు. ఇప్పుడు మరో అడుగు ముందుకువేస్తూ తెలుగు రాష్ట్రాల్లోనే మొదటి డాల్బీ సినిమా థియేటర్ (dolby cinema hyderabad) అందుబాటులోకి రానుంది. ‘అల్లు సినిమాస్’లో ఆసియాలోనే అతిపెద్ద డాల్బీ స్క్రీన్ కలిగిన థియేటర్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ థియేటర్ విశేషాలను అల్లు సినిమాస్ టీమ్ అధికారికంగా పంచుకుంది. ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘ధురంధర్2’ ప్రీమియర్స్‌తో (allu cinemas booking) ఇందులో బుకింగ్స్ ఓపెన్ కానున్నాయి.

**అల్లు సినిమాస్ ‘డాల్బీ స్క్రీన్’ విశేషాలివే..!**

హైదరాబాద్ సమీపంలోని కోకాపేటలో ‘అల్లు సినిమాస్’ డాల్బీ థియేటర్ నిర్మించారు.
తెలుగు రాష్ట్రాల్లో నిర్మించిన మొదటి డాల్బీ థియేటర్ కాగా, దేశంలో మూడోది. ఇప్పటివరకూ పుణె, బెంగళూరులలో మాత్రమే ‘డాల్బీ విజన్’ కలిగిన స్క్రీన్స్ అందుబాటులో ఉన్నాయి.
పుణెలోని సిటీ ప్రైడ్‌లో ఉన్న మొదటి డాల్బీ సినిమాస్ స్క్రీన్ సైజ్ 55 అడుగుల వెడల్పు, 26.2 అడుగుల ఎత్తు ఉండగా, బెంగళూరులోని ఏఎంబీ సినిమాస్‌లో ఉన్న స్క్రీన్ సైజ్ 65 అడుగుల వెడల్పుతో ఉంది.
ఇప్పుడు ‘అల్లు సినిమాస్’లో అందుబాటులోకి రానున్న డాల్బీ విజన్ స్క్రీన్ ఆసియాలోనే అతి పెద్దది. ఏకంగా 75 అడుగుల డీసీఐ ఫ్లాట్ స్క్రీన్‌తో (allu cinemas screen size) దీనిని తీర్చిదిద్దారు.
‘అల్లు సినిమాస్’లో మొత్తం నాలుగు స్క్రీన్‌లు ఉండగా, స్క్రీన్1లో డాల్బీ విజన్ సౌలభ్యం ఉంది. దీని సీటింగ్ సామర్థ్యం 644.
‘ధురంధర్: ది రివెంజ్’ మూవీ ప్రీమియర్స్‌తో ప్రేక్షకులకు అనుమతి ఇచ్చే అవకాశం.

## ‘ఫ్లవర్ కాదు ఫైర్’.. ముందు చెప్పింది నేనే.. కానీ: మంచు లక్ష్మి



హైదరాబాద్: ‘పుష్ప’ అంటే ఫ్లవర్ అనుకుంటివా ఫైర్.. ఈ డైలాగ్ ఎంత ఫేమస్ అయిందో చెప్పనవసరం లేదు. తొలుత ఈ డైలాగ్‌ను వేరే సినిమాలో తాను చెప్పానని అంటున్నారు నటి మంచు లక్ష్మి (Lakshmi Manchu). తాను కీలక పాత్ర పోషించిన ‘లేచింది మహిళాలోకం’ (Lechindhi Mahila Lokam) ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడారు. ఈ సినిమాలోనే ఆ డైలాగ్ చెప్పానని తెలిపారు.
“ఇది ‘పుష్ప’ రిలీజ్‌కు ముందు పూర్తిచేసిన చిత్రం. దర్శకుడు సుకుమార్ గారికి నేను చెప్పదలచుకుంది ఏంటంటే.. ఫ్లవర్ కాదు ఫైర్ అని ముందు నేనే చెప్పానండీ. కానీ, అప్పటికి మా డైలాగ్ విడుదల కాలేదు. ‘పుష్ప’ డైలాగ్ వినగానే.. నాదే అనిపించి, చాలా ఫీల్ అయ్యా” అని పేర్కొన్నారు. ‘లేచింది మహిళాలోకం’లో ఆమె.. పుష్ప పాత్రలో నటించడం గమనార్హం. అనన్య నాగళ్ల, శ్రద్ధాదాస్, హరితేజ, హేమ తదితరులు నటించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమాలో తాను మంచి కామెడీ పండించినట్లు లక్ష్మి తెలిపారు. సీరియస్ సబ్జెక్ట్‌ను కామెడీగా చెబితేనే చాలామంది వింటారన్నారు. సినిమాని సినిమాగానే చూడాలని కోరారు. ప్రస్తుతానికి సినిమాలు నిర్మించే ఉద్దేశం లేదని, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కథలు పంపొద్దంటూ విజ్ఞప్తి చేశారు.

## అభిమానులకు దేవుడు..
# ఆటగాళ్లకు 'మాస్టర్'!



క్రికెట్ దేవుడు అనగానే ఠక్కున గుర్తుకొచ్చే పేరు సచిన్ తెందుల్కర్. రికార్డులకు మారుపేరు ఈ క్రికెట్ దిగ్గజం.. ఇప్పుడు 'గురువు'గా మారారు. అదేదో అకాడమీ పెట్టడం వల్లనో.. బీసీసీఐ ప్రత్యేకంగా పదవి ఇవ్వడం వల్లో కాదు. ఎవరైనా సరే 'సార్' సలహాలు కావాలని అడిగితే చాలు 'మాస్టర్' అయిపోతాడీ బ్లాస్టర్ బ్యాటర్.

జాతీయ జట్టుకు ఎంపికైన తర్వాత ఆటగాళ్లకు తర్ఫీదు ఇవ్వడానికి కోచ్‌లు, సహాయక సిబ్బంది సిద్ధంగా ఉంటారు. వారి నుంచి ఎలాంటి సూచనలైనా, శిక్షణనైనా పొందొచ్చు. కానీ, మనకు ఎవరి మీదనైతే గురి ఉంటుందో.. వారినే ఎక్కువగా సలహాలు అడగడానికి ఆసక్తి చూపుతుంటాం. వారు మాజీలైనా సరే. ఈ కోవలోకి వచ్చే లెజెండరీ ప్లేయర్ సచిన్. దాదాపు పాతికేళ్ల కెరీర్‌లో అంతర్జాతీయంగా వందల మ్యాచులను ఆడిన సచిన్‌ను మించిన 'గురువు' ఇంకెవరు ఉంటారు మరి! అందుకేనేమో ఫామ్‌తో ఇబ్బంది పడిన ప్రతి యువ క్రికెటర్ 'మాస్టర్'తో టచ్‌లోకి వెళ్తారు. ఆయన నుంచి వచ్చిన చిన్నమాట సాయంతోనే భారీగా పరుగులు చేశామని పబ్లిక్‌గా బయటకు వెల్లడించిన భారత స్టార్‌లు చాలా మందే ఉన్నారు. చిన్నపిల్లలతోనూ క్రికెట్ ఆడేందుకు ఆసక్తి చూపించే ఈ 'దేవుడు'.. కష్టాల్లో ఉన్న ఏ ప్లేయర్లను వదిలేయడుగా! తాజాగా టీ20 ప్రపంచ కప్‌లో అద్భుతంగా రాణించిన సంజు శాంసన్ తన సక్సెస్ వెనక సచిన్ ఉన్నట్లు వెల్లడించాడు. అంతకుముందు శుభ్‌మన్ గిల్ కూడా సచినే తనలో స్ఫూర్తి నింపాడని ఓ సందర్భంలో అన్నాడు.

**సంజు ఇలా.. గిల్ అలా..**

పొట్టి కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన సంజు శాంసన్‌కు నెల రోజుల ముందు వరకూ జట్టులో స్థానం కూడా సందిగ్ధంగానే ఉండేది. టీ20 ప్రపంచ కప్ 2024 ఎడిషన్‌లో కనీసం ఒక్క మ్యాచ్‌కూడా ఆడలేకపోయాడు. ఈ రెండేళ్లలో వచ్చిన ఛాన్స్‌లను సద్వినియోగం చేసుకోలేక ఇబ్బంది పడ్డాడు. అలాంటి సమయంలో సచిన్ సలహాలు బాగా పనిచేశాయని సంజు చెప్పాడు. గతంలో శుభ్‌మన్ గిల్ కూడా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నాడు. గతేడాది ఇంగ్లాండ్ గడ్డపై తొలిసారి కెప్టెన్‌గా టెస్టు సిరీస్ ఆడిన శుభ్‌మన్ భారీగా పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇంగ్లిష్ బౌలర్ల పేస్‌ను ఎదుర్కోవడానికి 'మాస్టర్' ఇచ్చిన విలువైన చిట్కాలే బాగా పనిచేశాయని చెప్పాడు. డిఫెన్స్ ఆడేటప్పుడు బ్యాట్‌ను స్ట్రెయిట్‌గా పెట్టాలని.. స్క్వేర్ ఫీల్డింగ్ సెటప్‌లో పరుగులు రాబట్టాలని సచిన్ సలహా ఇచ్చాడట. ఆ దెబ్బతో గిల్ చెలరేగిపోయాడు.

**వీరికి కూడా..**

భారత మహిళా జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌కూ సచిన్ విలువైన సలహాలు ఇచ్చాడు. ఆ విషయాన్ని ఆమే స్వయంగా గతంలో ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. యువ క్రికెటర్ పృథ్వీ షా ఫామ్‌ను అందుకోవడానికీ సచిన్ మద్దతుగా నిలిచాడు. అందుకే, సచిన్ తెందుల్కర్ 'ఫీల్డ్'కు మాత్రమే రిటైర్‌మెంట్ ఇచ్చాడు.. భారత క్రికెట్‌కు కాదని విశ్లేషకులు చెబుతుంటారు.

## 'నువ్వు నెల రోజులే ఫామ్‌లో లేవు.. నేను గత రెండేళ్లు జట్టులో లేను"



టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేయడంలో అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ కీలక పాత్ర పోషించారు. తొలుత బ్యాటింగ్‌లో వీరిద్దరూ హాఫ్ సెంచరీలు సాధించారు. ఫీల్డింగ్‌లో ఇషాన్ మెరుపు క్యాచులతో అదరగొట్టాడు. ట్రోఫీని అందుకొన్న అనంతరం ఇషాన్, అభిషేక్ మీడియాతో సరదాగా సంభాషించారు. ఆ వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది.

ఫామ్ గురించి అభిషేక్ శర్మను అడగా.. "'ఆ ప్రశ్నకు ఇప్పుడు సరైన సమాధానం ఇవ్వగలను'' అని చెబుతుంటాడు. ఈలోగా ఇషాన్ మధ్యలో కల్పించుకుంటాడు. " ఆ ప్రశ్నకు నేనూ జవాబు ఇస్తా. అరే భాయ్ నువ్వు కేవలం ఒక్క నెల మాత్రమే ఫామ్‌లో లేవు. నేను గత రెండేళ్లు జట్టులో లేను'' అని ఇషాన్ అనడంతో అభిషేక్ శర్మ నవ్వేశాడు. దానికి అభిషేక్ ప్రతిస్పందిస్తూ.. ''అదే నా ఒక్క నెల నీ రెండేళ్లుగా భావించా'' అని బదులిచ్చాడు.

## మాటకు మాట కాదు.. అదిరిపోయే ఆట..
# ఇదీ మన సంజు స్పెషల్

**"సంజూనా.. మాకు నమ్మకం లేదయ్యా. ఎప్పుడూ కీలక మ్యాచుల్లో విఫలమవుతాడు. అతడికి అవకాశాలు ఎందుకు?" ఇలాంటి మాటలు ఎన్నో విన్నాడు. అయినా, తన నోటి నుంచి పల్లెత్తు మాట రాలేదు. ఓర్పు, సహనంతో సత్తా చాటితే ప్రపంచమే తన చెంతకు వస్తుందని నిరూపించాడీ 'కేరళం' ఆటగాడు సంజు శాంసన్.**



**నిరంతరం శ్రమిస్తూనే..**

పైన మనం అనుకొన్న మాటలకు పూర్తి అపోజిట్‌గా ఈ ప్రపంచ కప్‌లో సంజు గేమ్ ఉంది. టీమ్‌ఇండియా ఆడిన మూడు డూ ఆర్ డై మ్యాచుల్లోనూ అతడే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్. టోర్నీలోనే ఐదు మ్యాచులను మాత్రమే ఆడిన సంజు ఏకంగా 321 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. దీని వెనుక నిరంతర శ్రమ, కఠోర సాధన ఉంది. సంజు మ్యాచ్ ఆడాల్సిన సమయంలో ఎంత కష్టపడతాడో.. జట్టుకు దూరమైనప్పుడు అంతకంటే రెట్టింపు సాధన చేస్తాడు. టీ20 ప్రపంచ కప్ 2024లో ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం రాలేదు. అప్పుడే సచిన్ తెందుల్కర్‌తో మాట్లాడి విలువైన సూచనలు పొందాడు. పొట్టి కప్ ఫైనల్‌కు ముందు రోజూ సచిన్‌తో సంభాషించాడట. జట్టు కోసం ఏం చేయాలో ఓ స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేసుకున్నాడు. గత కొంతకాలంగా సోషల్ మీడియాకూ దూరంగా ఉన్నట్లు సంజు తెలిపాడు. పదేళ్ల కిందట క్రికెట్‌లోకి అడుగు పెట్టిన సంజు.. గత పది రోజుల్లో తాను ఎంత కీలక ఆటగాడినో నిరూపించాడు.

**మైలురాళ్ల కోసం ప్రయత్నించలేదు..**

జింబాబ్వేపై 15 బంతుల్లోనే 24 పరుగులు చేసి తన ఉద్దేశం ఏంటో చెప్పకనే చెప్పాడు. వెస్టిండీస్‌పై అజేయంగా 97 పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. తన సెంచరీ కంటే జట్టు గెలుపే ముఖ్యమని భావించాడు. దూకుడుగా ఆడిన తిలక్, హార్దిక్, శివమ్ దూబెకు ఆఖర్లో ఎక్కువ స్ట్రైకింగ్ ఇచ్చాడు. భీకరమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న ఇంగ్లాండ్ ఎదుట సెమీస్‌లో భారత్ 250+ స్కోరును లక్ష్యంగా నిర్దేశించడం వెనుకా సంజుదే కీలక పాత్ర. ఈ మ్యాచ్‌లోనూ 89 పరుగులు చేశాడు.

ఫైనల్‌లోనూ అద్భుతః అనిపించాడు. కివీస్‌పై 89 పరుగుల వద్ద మరోసారి భారీ షాట్‌కు యత్నించి పెవిలియన్‌కు చేరాడు. అప్పటికి ఇంకా ఐదు ఓవర్లు ఉన్నాయి. నెమ్మదిగా ఆడితే సెంచరీ చేసే ఛాన్స్ ఉంది. కానీ, అలా ఆలోచించలేదు.

''మా తాతయ్య జాలరి. సముద్రంలో వేటకు వెళ్లేటప్పుడు ఒక రోజు బాగా చేపలు పడేవి.. ఒక్కో రోజు ఒక్కటి కూడా దొరికేది కాదు. కానీ ఆయన ఎప్పుడూ తన పని మీద నమ్మకం కోల్పోలేదు. నేను కూడా అంతే. అవకాశం వచ్చినప్పుడు జట్టు కోసం ఆడతాను. ఒక్కో రోజు పరుగులు వస్తాయి. ఒక్కో రోజు రావు''

ఇదీ జీవితం గురించి శాంసన్ ఆలోచించే విధానం. ఇలా ఆలోచిస్తాడు కాబట్టే ఇప్పుడు నేషనల్ స్టార్ అయ్యాడు

**వారిద్దరిని చూస్తూ..**

సచిన్ తెందుల్కర్, రాహుల్ ద్రవిడ్ ఆటను చూస్తూ పెరిగిన సంజు శాంసన్‌కు వారే మార్గదర్శకులు. సంజు తండ్రి శాంసన్ విశ్వనాథ్ కూడా ఇదే మాట చెప్పారు. సంజు ఎప్పుడూ ఒత్తిడి లేకుండానే ఉంటాడు. అతడి బలం కూడా అదే'' అని విశ్వనాథ్ తెలిపారు. రోహిత్, విరాట్ నుంచీ చాలా విషయాలను నేర్చుకున్నట్లు ఓ సందర్భంలో సంజు తెలిపాడు.

చివరిగా: సంజు శాంసన్ బ్యాటింగ్ ప్రదర్శనపై టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తోపాటు మాజీలూ ప్రశంసల వర్షం కురిపించారు. 'క్లాస్'కు మారుపేరుగా సంజు నిలిచాడని అభినందించారు. ముమ్ముందూ ఇదే ఆటతీరు కొనసాగించి భారత జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షిద్దాం.

## టీ20 ప్రపంచ కప్..
# టాపర్లు వీరే, ముఖ్యమైన స్టాట్స్ ఇవే



అద్భుతమైన ఆటతీరుతో టీ20 ప్రపంచకప్ 2026ను టీమ్ ఇండియా కైవసం చేసుకుంది. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో సమష్టి కృషితో ఈ విజయం సాధ్యమైంది. ఈ నేపథ్యంలో ఈ ప్రపంచకప్‌లో టాపర్ల వివరాలు, ముఖ్యమైన గణాంకాలు ఇలా ఉన్నాయి.

ఒక మ్యాచ్‌లో అత్యధిక స్కోరు కొట్టింది కెనడా ప్లేయర్ యువరాజ్ సమ్రా. 110 పరుగులు చేశాడు.

ఉత్తమ బ్యాటింగ్ సగటు జింబాబ్వే బ్యాటర్ బ్రియాన్ బెన్నెట్‌ది. 146 సగటుతో అదరగొట్టాడు.

100కిపైగా పరుగులు చేసిన బ్యాటర్లలో ఉత్తమ స్ట్రయిక్ రేట్ (200) ఫిన్ అలెన్ (న్యూజిలాండ్) నమోదు చేశాడు.

అత్యధిక సిక్స్‌లు నమోదు చేసిన బ్యాటర్ భారత్ ఓపెనర్ సంజు శాంసన్. 5 మ్యాచ్‌ల్లో 24 సిక్స్‌లు బాదాడు. టోర్నమెంట్‌లో 4 అర్ధ శతకాలతో అత్యధిక 50లు బాదిన బ్యాటర్లలో టిమ్ సీఫర్ట్ టాప్‌లో నిలిచాడు. ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు ఫిన్ అలెన్ పేరిట నమోదైంది. న్యూజిలాండ్‌కి చెందిన ఈ విధ్వంసక బ్యాటర్ దక్షిణాఫ్రికాపై 33 బంతుల్లో శతకం నమోదు చేశాడు. టోర్నీలో అత్యధిక వికెట్లు పడగొట్టింది భారత పేసు గుర్రం జస్‌ప్రీత్ బుమ్రా. 8 మ్యాచుల్లో 14 వికెట్లు తీసుకున్నాడు.

ప్రపంచ కప్‌లో ఎక్కువ డాట్ బాల్స్ వేసింది ఇంగ్లాండ్‌కి చెందిన జోఫ్రా ఆర్చర్. మొత్తంగా 86 డాట్ బాల్స్ వేశాడు.

ఈ టోర్నీలో భారత్ 9 మ్యాచుల్లో 8 విజయాలు సాధించింది. దీంతో గెలుపు శాతం 88.9గా నమోదైంది. వికెట్ల వారీగా భారీ విజయం న్యూజిలాండ్‌ది. యూఏఈపై 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఇక పరుగుల వారీగా అయితే వెస్టిండీస్‌దే ఆ రికార్డు. జింబాబ్వేపై 107 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ ప్రపంచకప్‌లో ఎక్కువ క్యాచ్‌లు పట్టింది న్యూజిలాండ్ ప్లేయర్ గ్లెన్ ఫిలిప్స్. మొత్తంగా 11 క్యాచ్‌లు అందుకున్నాడు.

అత్యధిక పరుగుల రికార్డు పాకిస్థాన్‌కి చెందిన సహిబ్జాద ఫర్హాన్‌కి దక్కింది. 7 మ్యాచుల్లో 383 పరుగులు చేశాడు. అత్యధిక ఫోర్లు (37) ఘనతా అతనిదే.

గమనిక: ఈ డేటా పరిశోధన కోసం ఐసీసీ టీ20 వరల్డ్ కప్ వెబ్‌సైట్‌లోని స్టాట్స్‌ని పరిశీలించాం. వాటిల్లోని డేటాను గుర్తించడానికి గూగుల్ పిన్‌పాయింట్ సాంకేతికతను (Analyzed using Google Pinpoint) ఉపయోగించాం. ఎడిటోరియల్ టీమ్ కూడా ఈ డేటాను వ్యక్తిగతంగా ధ్రువీకరించింది.

## వరల్డ్ కప్ ఐసీసీ టీమ్ ఇదే.. భారత్ నుంచి నలుగురికి చోటు

**టీ20 ప్రపంచ కప్ 2026 టైటిల్‌ను భారత్ కైవసం చేసుకుంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో టీమ్‌ఇండియా కప్పు కొట్టేసింది. ఇది భారత్‌కు మూడో వరల్డ్ కప్ కావడం గమనార్హం. తాజాగా టీ20 ప్రపంచ కప్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన ప్లేయర్లతో కూడిన జట్టును ఐసీసీ ప్రకటించింది. ఇందులో భారత్ నుంచి నలుగురికి అవకాశం దక్కింది. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన సంజు శాంసన్, ఫైనల్ హీరో జస్‌ప్రీత్ బుమ్రాతోపాటు ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్య స్థానం కల్పించింది. అయితే, విన్నింగ్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు చోటు ఇవ్వలేదు. ఐసీసీ ప్రకటించిన జట్టుకు దక్షిణాఫ్రికా సారథి ఐదెన్ మార్‌క్రమ్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసింది.**

**టీమ్ ఇదే..**

**వికెట్ కీపర్‌గా సంజు శాంసన్ (భారత్)**
**సహిబ్జాద ఫర్హాన్ (పాకిస్థాన్)**
**ఇషాన్ కిషన్ (భారత్)**
**కెప్టెన్‌గా ఐదెన్ మార్‌క్రమ్ (దక్షిణాఫ్రికా)**
**హార్దిక్ పాండ్య (భారత్)**
**విల్ జాక్స్ (ఇంగ్లాండ్)**
**జాసన్ హోల్డర్ (వెస్టిండీస్)**
**జస్‌ప్రీత్ బుమ్రా (భారత్)**
**లుంగి ఎంగిడి (దక్షిణాఫ్రికా)**
**అదిల్ రషీద్ (ఇంగ్లాండ్)**
**బ్లెస్సింగ్ ముజరబాని (జింబాబ్వే)**
**12వ ప్లేయర్‌గా షాడ్లీ వాన్ (యూఎస్ఏ)**

